ANN తెలుగు

Follow: @ANNTELUGU

21-04-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 114 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## భారత్, దక్షిణ కొరియా మైత్రి

### ప్రపంచానికి శాంతి సందేశం

ప్రజాస్వామ్య విలువలే మన బంధానికి పునాది: ప్రధాని మోదీ

దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ముగిసిన కీలక ద్వైపాక్షిక చర్చలు

2030 నాటికి 50 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం

**ఢిల్లీ, మహా:** భారత్, దక్షిణ కొరియా దేశాల మధ్య ఉన్న దృఢమైన ద్వైపాక్షిక సంబంధాలకు ప్రజాస్వామ్య విలువలే బలమైన పునాది అని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన అనేవి రెండు దేశాల డీఎన్ఏలోనే అంతర్భాగంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం భారతదేశానికి విచ్చేసిన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ప్రధాని మోదీ దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత కీలకమైన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు దేశాధినేతలు సెమీ కండక్టర్ల తయారీ, రక్షణ రంగంలో సహకారం, పర్యావరణ హితమైన హరిత ఇంధనం, సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) వంటి అత్యంత కీలకమైన సామాజిక, ఆర్థిక అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ..

మిగతా 2లో

**టాప్ న్యూస్**



ఆర్టీసి సమ్మె లేకుండా చూస్తాం

- కాళేశ్వరం సభలో మంత్రి పొన్నం ప్రకటన


02



తిలక్‌వర్మ సూపర్ సెంచరీ

- ముంబై విన్

02



బాలీవుడ్ బాటలో పుష్పరాజ్

- ముంబైకి మకాం మారుస్తున్న అల్లు అర్జున్

02



# ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కార్

## భూపాలపల్లి జిల్లాలో రేవంత్ గర్జన

ప్రజాపాలనా.. పాపాల భైరవుడా..

- కేసీఆర్ 2029లో నువ్వో నేనో తేల్చుకుందాం
- నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా..
- కేసీఆర్ అహంకారానికి మేడిగడ్డ పిల్లర్లే సజీవ సాక్ష్యం
- జీవన్ రెడ్డి కార్యకర్తల గుండెలమీద తన్ని వెళ్ళాడు
- సీఎం రేవంత్ సవాళ్ళ పర్వం
- రైతుభరోసా రెండోవిడత నిధులు విడుదల..
- నాదీ మహేష్ గౌడ్ ది వైఎస్ డీఎస్ జోడీ



**కరీంనగర్, మహా:**

"తెలంగాణ గడ్డపై మరో పదేళ్ల పాటు ప్రజా పాలనే కొనసాగుతుంది.. వచ్చే ఎన్నికల్లోనూ మనమే గెలుస్తాం.. *ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్*" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా నస్తూరుపల్లి సాక్షిగా సింహ గర్జన చేశారు. జగిత్యాలలో కేసీఆర్ చేసిన విమర్శలకు అదే స్థాయిలో, అంతకంటే రెట్టింపు వాడితో రేవంత్ రెడ్డి ప్రతిదాడికి దిగారు. ఇది కేవలం ఒక నినాదం మాత్రమే కాదు, రాబోయే దశాబ్ద కాలం పాటు తెలంగాణ గడ్డపై ప్రజా పాలనే రాజ్యమేలుతుందనే ఒక ధీశాలి సంకల్పమని ఆయన చాటిచెప్పారు. మేడిగడ్డ సాక్షిగా గత ప్రభుత్వ అవినీతి కోటలను బద్దలు కొడుతూ, అభివృద్ధి , సంక్షేమమే తమ ప్రభుత్వ చిరునామా అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. వైఎస్ డీఎస్ కాంబినేషన్ లాగా, తనది మహేష్ గౌడ్ ది హిట్ కాంబినేషన్ అని, పార్టీని మళ్ళీ అధికారంలోకి తెస్తామన్నారు.

మిగతా 2లో



# మళ్ల వచ్చేది కేసీఆర్ సర్కారే

## హైడ్రాను ఎత్తి అవతల పారేస్తాం

- మొదటి సంతకం దానిపైనా..
- హైదరాబాద్ లో హైడ్రా.. నిజామాబాద్ లో నిద్రా అట..
- పాలన వదిలేసి కేసీఆర్ చావాలి అని కోరుకుంటున్నారు
- వెయ్యి జన్మలెత్తినా.. నేను చావను నా కొడకా
- జగిత్యాల సభలో కేసీఆర్ నిప్పులు
- జీవన్ రెడ్డి సేవలు రాష్ట్రస్థాయిలో వాడుకుంటామని ప్రకటన



**జగిత్యాల, మహా**

మొన్న కేవలం 1.7 శాతం ఓట్లతోనే ఓడిపోయాం. ప్రజలు ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ నైజాన్ని గ్రహిస్తున్నారు. మళ్లీ బరాబర్ మనమే అధికారంలోకి వస్తాం.. ఈసారి బంపర్ మెజార్టీతో వస్తాం" అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హైడ్రా తెచ్చింది కాక దాన్ని జిల్లాలకూ తెస్తామంటున్నారని, బీఆర్ఎస్ రాగానే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తామని, పనికిమాలిన హైడ్రాను పీకేసేందుకే తొలి సంతకం పెడతాని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. హైద్రాబాద్ లో హైడ్రా తెస్తే.. నిజామాబాద్ లో నిద్రా వస్తదని పీసీసీ అధ్యక్షుడు అంటున్నారు. జగిత్యాలకు జిద్రా వస్తదా? అని ఎద్దేవా చేశారు. సీనియర్ నాయకులు టీ. జీవన్ రెడ్డికి కేసీఆర్ స్వయంగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ, జీవన్ రెడ్డి కేవలం జగిత్యాల కోసమే కాకుండా తెలంగాణ అస్తిత్వ పోరాటం కోసం బీఆర్ఎస్‌లోకి వచ్చారని కొనియాడారు. ఆయనను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించడమే కాకుండా, రాబోయే ప్రభుత్వంలో ఆయనకు అత్యంత కీలకమైన పదవిని అప్పగిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు.

### మూసీ సుందరీకరణ వెనుక భారీ కుట్ర

మూసీ నది ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. మూసీని శుభ్రం చేయడం మంచిదే కానీ, ఆ పేరుతో 15 వేల పేదల ఇళ్లను కూలగొట్టడం

మిగతా 2లో

### రైతుబంధుకు రాంరాం

తమ పదేళ్ల పాలనలో 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చి రైతులను రాజును చేశామని, కానీ నేడు మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయని ఆయన ధ్వజమెత్తారు. రైతుబంధు పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాంరాం చెప్పిందని, దళితబంధును జై భీమ్ అంటూ అటకెక్కించారని మండిపడ్డారు. "నేను ఇక్కడ సభ పెడుతున్నానని తెలిసి ఇవాళ రెండో విడత రైతుబంధు నిధులు విడుదల చేశారు.. మరి మూడో విడత వేయాలంటే నేను మళ్లీ సభ పెట్టాలా?" అని ఆయన వేసిన ప్రశ్న ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టింది. వ్యవసాయ రంగం కుదేలవుతోందని, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### బంపర్ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి..

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. "మొన్న కేవలం 1.7 శాతం ఓట్ల తేడాతోనే ఓడిపోయాం.. అది ప్రజలు మాపై కోపంతో ఇచ్చిన తీర్పు కాదు, కాంగ్రెస్ అబద్ధాలను నమ్మి చేసిన పొరపాటు" అని ఆయన విశ్లేషించారు. ప్రజలు ఇప్పుడిప్పుడే వాస్తవాలను గ్రహిస్తున్నారని, మళ్లీ బరాబర్ మనమే అధికారంలోకి వస్తామని కేడర్‌లో ఉత్సాహం నింపారు. ఈసారి గెలుపు మామూలుగా ఉండదని, బంపర్ మెజార్టీతో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆయన జోస్యం చెప్పారు. కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రజలు మళ్లీ గులాబీ జెండా వైపు చూస్తున్నారని స్పష్టం చేశారు.

# ఢిల్లీకి హరీష్ టీమ్

**కాళేశ్వరం, ఫిరాయింపుల కేసులపై సుప్రీం లాయర్లతో కీలక మంతనాలు**

**హరీష్ ఢిల్లీ పర్యటనపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు**



**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సోమవారం ఢిల్లీ వెళ్ళగా, ఈ పర్యటనపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన విచారణ కమిషన్, అలాగే ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసుల వ్యవహారం ఇప్పుడు న్యాయస్థానాల పరిధిలో అత్యంత కీలక దశకు చేరుకున్నాయి. కాళేశ్వరం కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై ఈనెల 22వ తేదీన తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పును వెలువరించనున్నట్లు

మిగతా 2లో

## తమిళనాడు ప్రచారానికి చంద్రబాబు ఫైనల్ టచ్

అభివృద్ధి మంత్రంతో కూటమి శ్రేణుల్లో నయా జోష్

తుది అంకానికి తమిళనాడు ఎన్నికల సమరం

ఎన్డీఏ విజయమే లక్ష్యంగా సుడిగాలి పర్యటన




**చెన్నై, మహా:** అత్యంత ఉత్కంఠభరితంగా సాగుతున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం తుది దశకు చేరుకున్న వేళ, జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) తన ప్రచార అస్త్రాన్ని మరింత పదును పెట్టింది. కూటమి అభ్యర్థుల ఘన విజయమే ఏకైక లక్ష్యంగా, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు గత రెండు రోజుల నుంచి తమిళనాట సుడిగాలి పర్యటన చేస్తున్నారు.

మిగతా 2లో

## సామాన్యుడి పాలిట సంజీవని మంగళగిరి ఎయిమ్స్

- రూ.10 కే కార్పొరేట్ స్థాయి వైద్యం
- నామమాత్రపు ధరలకే మెరుగైన వైద్య పరీక్షలు
- రూ.1610 కోట్లతో సకల సదుపాయాలు
- రెండు రాష్ట్రాల ప్రజలకు అందుబాటులో ఎయిమ్స్
- జాతికి అంకితం చేసిన కేంద్ర ప్రభుత్వం



**మంగళగిరి,మహా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరిలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటైన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకు ఒక మహా వరంగా మారింది. సుమారు 183 ఎకరాల సువిశాలమైన, పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో రూ. 1610 కోట్ల భారీ వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఆసుపత్రిని నిర్మించి జాతికి అంకితం చేసింది. ఏకంగా 960 పడకల సామర్థ్యంతో, 600 మందికి పైగా నిష్ణాతులైన వైద్యులు, సిబ్బందితో 24 గంటల పాటు నిరంతరాయంగా ఈ ఆసుపత్రి అత్యుత్తమ సేవలను అందిస్తోంది.

మిగతా 2లో

# ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కార్



(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ 2029లో నువ్వో నేనో తేల్చుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే తన పేర్చుకుంటానని శపథం చేశారు. ప్రజాపాలనలో రైతు ఉత్సవాల పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ పాల్గొన్నారు. సభావేదిక పైనుంచి రెండో విడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. కేసీఆర్ నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. కార్యకర్తల సాక్షిగా ఇదే నా సవాల్. 2029లో నువ్వో నేనో తేల్చుకుందాం. కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్లను గోదావరిలో పోసి వృథా చేశారు. కాళేశ్వరం పేరిట చేసిన దోపిడీకి కేసీఆర్‌కు ఉరి వేసినా తప్పులేదు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరం అయ్యింది అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**రైతులకు మేలుచేసింది మేమే**

దేశంలోనే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన తొలి పార్టీ కాంగ్రెస్ అని సీఎం గుర్తు చేశారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి రైతులకు నీరిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చే చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తుచేశారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి రైతులకు నీరిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చే చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి సంవత్సరంలోపే చేసి చూపించామని సీఎం తెలిపారు. 25.35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద రూ.22 వేల కోట్లు వేశామని, గత విడతలో రైతు భరోసా కింద 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు వేశామని వెల్లడించారు. ఇవాళ రెండో విడతగా రూ.5,700 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని, మిగతా రూ.3,300 కోట్లు వచ్చే నెలలో రైతుల ఖాతాల్లో వేస్తామని చెప్పారు. తెలంగాణలో 3.5 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం ఇస్తున్నామని అన్నారు. పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన గతంలో ఎవరికైనా వచ్చిందా? ప్రశ్నించారు.

**పాపాలభైరవుడు మళ్ళీ ఎందుకు రావాలి?**

ప్రజాపాలన పోవాలని పాపాల భైరవుడు రావాలని అని ఒక పెద్దమనిషి అంటున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఫామ్‌హౌస్‌లో పడుకునే పాపాల భైరవుడు మళ్లీ ఎందుకు రావాలని ప్రశ్నించారు. లక్షలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్ జెండా మోస్తే ఈ ప్రభుత్వం వచ్చిందని కొనియాడారు. పాపాల భైరవుడు ఎందుకు రావాలో పార్టీ మారుతున్న పెద్ద మనిషి చెప్పాలని, జీవన్‌రెడ్డి చరిత్ర, ఆయన వెనకున్న మచ్చలన్నీ తనకు తెలుసనని అన్నారు. 40 సంవత్సరాల పాటు తన కుటుంబానికి ఎన్నో పదవులు ఇచ్చుకున్నారని, 14 సార్లు కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ ఇస్తే మోసం చేసి వెళ్లిపోయారని, ఓడిపోయినప్పటికీ ఎన్నోసార్లు పదవులు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ఆయన్ను గౌరవించిందని తెలిపారు. సంవత్సరం పాటు పదవి లేకపోతే జీవన్‌రెడ్డి కార్యకర్తల గుండెల మీద తన్ని శత్రువు పంచన చేశారని వెల్లడించారు. సమావేశంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు, పొంగులేటి, పొన్నం ప్రభాకర్, సీతక్క, వివేక్, అడ్లూరి, విజయరమణారావు, తదితరులు పాల్గొన్నారు.

# మళ్ల వచ్చేది కేసీఆర్ సర్కారే

(మొదటిపేజీ తరువాయి)

ఏ రకమైన ధర్మమని ఆయన నిలదీశారు. ఇది కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే జరుగుతున్న కుట్ర అని, బడా వ్యాపారులకు మేలు చేసేందుకే పేదల ఇళ్లను బలి ఇస్తున్నారని ఆరోపించారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని పేదలకు అండగా బీఆర్ఎస్ నిలుస్తుందని, వారి ఇళ్లను తాకనిచ్చే ప్రసక్తే లేదని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజాధనాన్ని ఇలాంటి వినాశకర పనులకు కాకుండా అభివృద్ధి పనులకు వెచ్చించాలని ఆయన హితవు పలికారు. తులం బంగారం, స్కూటీలు, పెంచిన పెన్షన్లు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతుబంధు, దళితబంధులను గాలికి వదిలేసి రైతులను, పేదలను ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దలు పాలన వదిలేసి కేసీఆర్ చావాలి అని కోరుకుంటున్నారు. వెయ్యి జన్మలెత్తినా నేను చావను నా కొడకా.. అంటూ ఘాటుగా స్పందించారు. అభివృద్ధి ముచ్చట లేదని, కేవలం పాలకుల చిల్లర మాటలు తప్ప రాష్ట్రంలో ఏమీ జరగడం లేదని ధ్వజమెత్తారు.

**నాడు గంజి కేంద్రాలు.. నేడు అంధకారం**

తెలంగాణ సాధన కోసం తాను చేసిన ఉద్యమాన్ని, అప్పట్లో ఉన్న దుర్భర పరిస్థితులను కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పాలమూరు నుంచి 90 శాతం వలసలు ఉండేవని, తిండి లేక గంజి కేంద్రాలు నడిచిన రోజులను తాము మార్చి తెలంగాణను సస్యశ్యామలం చేశామని చెప్పారు. ఇంటింటికీ మంచి నీళ్లు ఇచ్చే 'మిషన్ భగీరథ'ను అద్భుతంగా అమలు చేశామని, కానీ నేడు మళ్లీ మంచి నీళ్ల కోసం ప్రజలు గోస పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాటు నిరంతరాయంగా నీరు ఇస్తే ఇప్పుడు ఎందుకు రావడం లేదని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి తీసుకెళ్తున్నారని ఆయన మండిపడ్డారు.



**420 హామీలతో మోసం..కాంగ్రెస్ వైఫల్యాలపై ధ్వజం**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కేసీఆర్ '420' హామీలుగా అభివర్ణించారు. అధికారంలోకి రావడం కోసం అసాధ్యమైన మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టారని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చలేక చేతులెత్తేస్తున్నారని ధ్వజమెత్తారు. తులం బంగారం, స్కూటీలు, పెంచిన పెన్షన్లు ఏమయ్యాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను వంచించారని, దళితబంధును ఆపివేసి ఎస్సీ, ఎస్టీలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధపు హామీలతో గెలిచిన పార్టీ ఎక్కువ కాలం నిలవదని, ప్రజలు అప్పుడే తమ పాత రోజులను గుర్తు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరం..**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని కేసీఆర్ తన ప్రసంగంలో ఆందోళన వ్యక్తం చేశారు. తమ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం అద్భుతంగా ఉండేదని, నేడు భూమి అమ్మేవాడు ఉన్నాడు కానీ కొనేవాడు దిక్కులేదని ఆయన విశ్లేషించారు. రాష్ట్ర ఆదాయం పడిపోవడానికి పాలకుల అసమర్థతే కారణమని, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. పల్లె ప్రకృతి వనాలు ఎండిపోతున్నాయని, మున్సిపాలిటీలు మురికికూపాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక క్రమశిక్షణ లేని పాలన వల్ల రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలో పడుతోందని ఆయన హెచ్చరించారు. గతంలో చంద్రబాబు హయాంలో జరిగిన బషీర్ బాగ్ కాల్పుల ఘటనలను కేసీఆర్ గుర్తు చేస్తూ, తెలంగాణ వ్యతిరేక శక్తులతో ప్రస్తుత ప్రభుత్వం చేతులు కలిపిందని ఆరోపించారు. కరెంట్ ఛార్జీల పెంపునకు నిరసనగా ప్రజలు రోడ్లపైకి వస్తే కాల్చి చంపిన ఘటన తనను ఉద్యమం వైపు నడిపించిందని చెప్పారు. నేడు మళ్లీ అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని, రైతుల మోటార్లకు మీటర్లు పెట్టేందుకు ప్రభుత్వం సంతకం చేసిందని విమర్శించారు. మోదీ మెడపై కత్తి పెట్టినా తాను మీటర్లు పెట్టనివ్వలేదని, కానీ ఈ ప్రభుత్వం కేంద్రం ఇచ్చే డబ్బుల కోసం సంతకం పెట్టి రైతులకు అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు.

**షాపులో లేని యూరియా యాప్ లో ఉంటుందా?**

వ్యవసాయ రంగంలో ప్రస్తుతం నెలకొన్న గందరగోళంపై కేసీఆర్ ఘాటుగా స్పందించారు. తమ హయాంలో ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేస్తే ఎన్ని అంటే అన్ని యూరియా బస్తాలు ఇంటికి వచ్చే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రైతులు యాప్‌లు పట్టుకుని తిరుగుతూ కాళ్లు వాపులు తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పంట వేసిన దగ్గర నుంచి కొనేవరకు రైతులకు అండగా నిలబడే వ్యవస్థను కాంగ్రెస్ పతనం చేసిందని మండిపడ్డారు. మక్కలు కొనే దిక్కులేదని, చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే స్థితికి వచ్చారని వాపోయారు. రైతు పక్షపాతిగా ఉన్న బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే అన్నదాతలకు అసలైన న్యాయం జరుగుతుందని ఆయన ఉద్ఘాటించారు.

**తెలంగాణ పునర్నిర్మాణానికి మళ్లీ అంకురార్పణ**

జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభ తెలంగాణ రాజకీయాల్లో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని కేసీఆర్ అభివర్ణించారు. తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం జగిత్యాల నుంచే మళ్లీ మొదలవుతుందని ఆయన ప్రకటించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కానీ తాము వదలబోమని చెప్పారు. కూల్చివేతలు, కాల్చివేతలు తప్ప ఈ ప్రభుత్వానికి మరేమీ తెలియదని, అభివృద్ధి మార్గంలో రాష్ట్రాన్ని మళ్లీ నడిపించే బాధ్యత బీఆర్ఎస్ పైనే ఉందని చెప్పారు. జగిత్యాల నుంచి ప్రారంభమైన ఈ జైత్రయాత్ర రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి చేరుతుందని, గులాబీ జెండా మళ్లీ సగర్వంగా ఎగరబోతోందని కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# భారత్, దక్షిణ కొరియా మైత్రి

(మొదటిపేజీ తరువాయి)

భారత్, దక్షిణ కొరియా దేశాల మధ్య ఉన్న మైత్రీబంధం యావత్ ప్రపంచానికి శాంతి, స్థిరత్వ సందేశాన్ని ఇస్తుందని కొనియాడారు. భౌగోళికంగా అత్యంత కీలకమైన ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, సమగ్ర వృద్ధి సాధన కోసం రెండు దేశాలు ఒకే విధమైన బలమైన దృక్పథాన్ని కలిగి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. గత దశాబ్ద కాలంలో ఇరు దేశాల మధ్య దౌత్య, వాణిజ్య బంధం మరింత క్రియాశీలకంగా, పటిష్టంగా మారిందని ప్రధాని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రతి రంగంలోనూ వస్తున్న సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటూ, రెండు దేశాలు అభివృద్ధి పథంలో భుజం భుజం కలిపి ముందుకు సాగుతాయని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

**వాణిజ్య, ఆర్థిక రంగాల్లో సరికొత్త అధ్యాయం**

ఈ ద్వైపాక్షిక చర్చల్లో ప్రధానంగా వాణిజ్య, ఆర్థిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తృతం చేసుకునే దిశగా ఇరు దేశాలు సంచలన నిర్ణయాలు తీసుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ వాణిజ్య లక్ష్యాలను వివరిస్తూ.. ప్రస్తుతం భారత్, దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 27 బిలియన్ డాలర్లకు చేరుకుందని, దీనిని 2030వ సంవత్సరం నాటికి ఏకంగా 50 బిలియన్ డాలర్లకు పెంచే దిశగా ఈరోజు అత్యంత కీలక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. రెండు దేశాల మధ్య ఆర్థికపరమైన లావాదేవీలను మరింత సులభతరం చేసి, పెట్టుబడులను ఆకర్షించేందుకు 'భారత్‌కొరియా ఫైనాన్షియల్ ఫోరమ్'ను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. వ్యాపార రంగంలో సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఒక ప్రత్యేక పారిశ్రామిక సహకార కమిటీని సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనితో పాటుగా కీలకమైన సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, సరఫరా గొలుసుల్లో సహకారాన్ని పెంపొందించుకునే ఉద్దేశ్యంతో ఆర్థిక భద్రతా చర్చలకు శ్రీకారం చుడుతున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. కొరియన్ కంపెనీలు, ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు భారతదేశంలోకి ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రవేశించి తమ వ్యాపారాలను సులభతరం చేసుకోవడానికి ప్రత్యేకంగా 'కొరియన్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్'లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. అలాగే రాబోయే ఏడాది కాలంలో భారత్, కొరియా వాణిజ్య ఒప్పందాన్ని మరింత ఉన్నత స్థాయికి అప్‌గ్రేడ్ చేసి, ఇరు దేశాల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

# సామాన్యుడి పాలిట సంజీవని మంగళగిరి ఎయిమ్స్

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, అంకితభావంతో పనిచేసే డాక్టర్లతో రోగులకు ఇక్కడ అద్భుతమైన వైద్యం అందుతోంది. కేవలం ఆంధ్రప్రదేశ్ ప్రజలకే కాకుండా, పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని సరిహద్దు జిల్లాల ప్రజలు సైతం ఈ అరుదైన వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకునే అద్భుత అవకాశం ఉంది. ఈ ఆసుపత్రిలో రోగులకు అందించే వైద్య సేవలు, పరీక్షల ధరలు అతి సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా నామమాత్రంగా నిర్ణయించారు. కేవలం పది రూపాయల ఓపీ (ఔట్ పేషెంట్) ఫీజు చెల్లించి జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, కన్ను, చెవి, ముక్కు, గొంతు , దంత వైద్యం, చర్మవ్యాధులు తదితర ఎన్నో రకాల స్పెషలిస్ట్ విభాగాల్లో నిపుణులైన వైద్యులను సంప్రదించవచ్చు. ప్రస్తుతం న్యూరో విభాగం మినహా దాదాపు అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి, త్వరలోనే న్యూరో సేవలను కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు ఆసుపత్రికి చేరుకుంటే, మధ్యాహ్నం కల్లా వైద్య పరీక్షలు ముగించుకుని ప్రశాంతంగా వెనుతిరిగేలా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అలాగే ఆసుపత్రి ప్రాంగణంలోనే అత్యంత శుభ్రంగా నిర్వహించబడుతున్న క్యాంటీన్‌లో కేవలం 75 రూపాయలకే ఎంతో రుచికరమైన, నాణ్యమైన భోజనం రోగులకు, వారి బంధువులకు లభిస్తోంది. మంగళగిరి ఎయిమ్స్‌కు చేరుకోవడం కూడా ప్రయాణికులకు ఎంతో సులభతరం. విజయవాడ నుంచి నేరుగా ఆసుపత్రికి బస్సు సౌకర్యం అందుబాటులో ఉండగా, మంగళగిరి బస్ స్టాండ్ నుంచి కేవలం 10 రూపాయల ఛార్జీతో బస్సులు, 30 నుంచి 50 రూపాయల ఛార్జీతో ఆటోలు నిరంతరం అందుబాటులో ఉంటాయి. బయట ప్రైవేట్ ల్యాబ్‌లలో ఐదు వేల నుంచి పది వేల రూపాయల వరకు ఖర్చయ్యే ఖరీదైన వైద్య పరీక్షలు, ఎయిమ్స్‌లో కేవలం ఐదు వందల నుంచి ఆరు వందల రూపాయల లోపే పూర్తి చేయించుకోవచ్చు. ఆర్థిక స్థోమత లేని పేదలకు ఈ ఆసుపత్రి నిజంగా ఒక ఆశాకిరణం.

# హరీష్ బతికుండగా బీఆర్ఎస్ అధికారంలోకి రాదు

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు

**ఖమ్మం, మహా:** బీఆర్ఎస్ పార్టీలో తనకు తగిన ప్రాధాన్యత, గుర్తింపు లభించకపోవడం వల్లే హరీష్ రావు నానా తిప్పలు పడుతున్నారని, ప్రాధాన్యత కోసమే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారపూరిత పాలనతో రాష్ట్ర ప్రజల ఆశలపై మట్టి పోసిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలను మోసం చేస్తూ, వ్యవస్థలను అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని ఆయన విమర్శించారు. అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని 'రావణ కాష్టం'లా మార్చేశారని తుమ్మల తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన దోపిడీని స్పష్టంగా గుర్తించిన ప్రజలు ఆ పార్టీని పూర్తిగా పక్కన పెట్టేశారని.. హరీష్ రావు బతికుండగా బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమని ఆయన కుండబద్దలు కొట్టారు.

**కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు..**

వరంగల్‌లో ఇటీవల జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో కనీసం హరీష్ రావు ఫోటో కూడా లేకపోవడమే ఆయన దీనస్థితికి నిదర్శనమన్నారు. సొంత పార్టీలోనే ప్రాధాన్యత కోల్పోయిన ఆయన.. ఎక్కడికి వెళ్లినా పాత 'ఆవు కథ'నే చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిగా అవినీతిమయం చేసి, రాష్ట్రాన్ని ఏకంగా ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో నెట్టేసిన వారికి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి నీతులు చెప్పే నైతిక హక్కు ఏమాత్రం లేదని తుమ్మల స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 21 వేల కోట్లు రుణమాఫీ కింద వారి ఖాతాల్లో జమ చేసిందని.. దీనిపై కూడా విమర్శలు చేయడం హరీష్‌రావు మానసిక స్థితికి అద్దం పడుతోందని మంత్రి ఎద్దేవా చేశారు.

**కమీషన్ల కోసమే సీతారామ ప్రాజెక్టు నిర్వీర్యం**

ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వరప్రదాయిని అయిన సీతారామ ప్రాజెక్టుపై గత ప్రభుత్వ వైఫల్యాలను తుమ్మల నాగేశ్వరరావు బట్టబయలు చేశారు. సీతారామ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం రూ. 8 వేల కోట్లు నీళ్ల పాలు చేసినప్పటికీ, ఒక్క ఎకరానికి కూడా నీరు అందించలేకపోయిందని ఆరోపించారు. ప్రాజెక్టు రూపకల్పనలో భారీ లోపాలు ఉన్నాయని, కేవలం కమీషన్ల కోసమే కేంద్ర అనుమతులు లేకుండా హడావుడిగా ప్రాజెక్టును ప్రారంభించి నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమే తన జీవితాశయమని ప్రకటించిన మంత్రి.. వచ్చే జూన్ నాటికి 16 వేల ఎకరాలకు, అలాగే పినపాక నియోజకవర్గంలో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించి తీరుతామని రైతులకు భరోసా ఇచ్చారు.

# తిలక్ వర్మ సూపర్ సెంచరీ

## ముంబై విన్

**మహా:** పీఎల్ 2026 సీజన్‌లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ ఎట్టకేలకు భారీ విజయంతో ఊపిరి పీల్చుకుంది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత బరిలోకి దిగిన హార్దిక్ సేన, ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. సోమవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 99 పరుగుల భారీ తేడాతో గ్రాండ్ విక్టరీ నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో యువ సంచలనం తిలక్ వర్మ (101*) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, 4 వికెట్ల హీరో అశ్వని కుమార్, ఇతర బౌలర్లు సమష్టిగా రాణించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.

# ఢిల్లీకి హరీష్ టీమ్

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. ఈ తీర్పు రాజకీయంగా, చట్టపరంగా అత్యంత కీలకం కానున్న నేపథ్యంలో, ముందస్తుగానే అన్ని రకాల న్యాయపరమైన ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకోవాలని బీఆర్ఎస్ అధిష్ఠానం భావిస్తోంది. హైకోర్టు తీర్పు కాపీ వెలువడిన వెంటనే దానికి అనుగుణంగా స్పందించేలా పకడ్బందీ ప్రణాళికను రచిస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే హరీశ్ రావు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ ఢిల్లీలో సుప్రీంకోర్టుకు చెందిన పలువురు సీనియర్, ఉద్దండ న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘ మంతనాలు జరిపింది. కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు నుంచి రాబోయే తీర్పును బట్టి, ఒకవేళ అవసరమైతే ఏమాత్రం కాలయాపన చేయకుండా తక్షణమే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలపై న్యాయవాదులతో లోతుగా చర్చించారు. దీనితో పాటుగా, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి ఫిరాయించిన వ్యవహారంపై కూడా న్యాయవాదులతో బృందం చర్చించింది. ఫిరాయింపులకు పాల్పడిన శాసనసభ్యులపై అనర్హత వేటు వేయించే దిశగా, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఆధారంగా న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి కఠిన చర్యలపై న్యాయవాదుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద స్పీకర్ నిర్ణయంలో జాప్యం జరిగితే కోర్టుల ద్వారా ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై స్పష్టమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో వివరాలను వెల్లడించింది. కాగా బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడానికి ఈ పర్యటన హరీష్ చేశారని కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పించారు.

# తమిళనాడు ప్రచారానికి చంద్రబాబు ఫైనల్ టచ్




(మొదటిపేజీ తరువాయి)

ప్రచారానికి నేటితో (మంగళవారం) తెరపడనున్న కీలకమైన తరుణంలో, ఓటర్లను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు కూటమి శ్రేణుల్లో సమరోత్సాహం నింపడమే ప్రధాన అజెండాగా చంద్రబాబు తనదైన శైలిలో ఈ ప్రచారానికి 'ఫైనల్ టచ్' ఇస్తున్నారు. అధికారిక వర్గాల సమాచారం మేరకు.. సోమవారం మధ్యాహ్నం కోయంబత్తూరులో జరిగిన భారీ బహిరంగ సభతో ఆయన పర్యటన అట్టహాసంగా ప్రారంభమైంది. ఆ తర్వాత పారిశ్రామిక కేంద్రాలైన హోసూర్, తల్లీ ప్రాంతాల్లో జరిగిన ప్రతిష్టాత్మక ఎన్నికల ర్యాలీల్లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. అదే రోజు రాత్రికి రాష్ట్ర రాజధాని చెన్నై చేరుకున్న ఆయన, ఆవడిలో ఏర్పాటు చేసిన భారీ రోడ్‌షోలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సుదీర్ఘ పర్యటనలో స్థానిక ప్రజలు, ఎన్డీఏ మద్దతుదారులతో ఆయన ముఖాముఖి ఆత్మీయంగా సంభాషించి, రాష్ట్రాన్ని అద్భుతమైన అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎన్డీఏకు బ్రహ్మరథం పట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల పర్యటనలో భాగంగా మంగళవారం చంద్రబాబు మదురైను సందర్శించనున్నారు. అక్కడి నుంచి నేరుగా సత్తూర్ చేరుకుని, వివిధ వర్గాలకు చెందిన కీలకమైన సామాజిక నేతలతో ప్రత్యేకంగా సమావేశమై తుది విడత ఎన్నికల వ్యూహాలపై లోతుగా చర్చించనున్నారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రచార సభలో పాల్గొని ప్రసంగించిన తర్వాత, సాయంత్రానికి ఆయన తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు పయనమవుతారు. ప్రధానంగా ఈ రెండు రోజుల ఎన్నికల ప్రచారంలో 'అభివృద్ధి, సుపరిపాలన' అనే బలమైన నినాదాలే అడుగడుగునా హైలైట్ కానున్నాయి. ఒక ముఖ్యమంత్రిగా సాంకేతిక ఆధారిత పాలనలో, అలాగే ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనలో తనకున్న దశాబ్దాల అపార అనుభవాన్ని సోదాహరణంగా వివరిస్తూ.. తమిళనాడు సమగ్ర అభివృద్ధికి ఎన్డీఏ దార్శనికత ఎంత అవసరమో ఆయన ప్రజలకు సవివరంగా తెలియజేయనున్నారు. దేశవ్యాప్త ప్రగతి అజెండాను ప్రతిబింబించేలా సాగుతున్న ఈ చారిత్రక యాత్రతో తమిళనాట కూటమి శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. అత్యంత తక్కువ సమయంలోనే వరుస రోడ్‌షోలు, భారీ బహిరంగ సభలతో ఓటర్ల నాడిని విశేషంగా ప్రభావితం చేసేలా చంద్రబాబు తనదైన రాజకీయ చాణక్యాన్ని ప్రదర్శిస్తూ ఈ ప్రచార వ్యూహాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

# బాలీవుడ్ బాటలో పుష్పరాజ్

**ముంబై, మహా:** 'పుష్ప' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో అద్భుతమైన ఫాలోయింగ్ సంపాదించుకుని, బాక్సాఫీస్ వద్ద రికార్డుల రారాజుగా నిలిచిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇప్పుడు గ్లోబల్ మార్కెట్‌పై కన్నేశారు. వరుస భారీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్న ఆయన, తదుపరి ఏకంగా బాలీవుడ్‌లో సైతం తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా, మాస్ యాక్షన్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'రాక' చిత్రంలో ఆయన నటిస్తున్న విషయం విదితమే. ఇటీవల అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేయడంతో పాటు, అభిమానుల్లో భారీ అంచనాలను రేకెత్తించింది. ఈ చిత్రానికి సంబంధించిన మెజారిటీ షూటింగ్ ముంబై పరిసర ప్రాంతాల్లోనే జరగనుండటంతో, పదేపదే హైదరాబాద్ నుంచి ముంబైకి ప్రయాణించడం వల్ల విలువైన సమయం వృథా అవుతోందని భావించిన అల్లు అర్జున్.. ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సినీ వర్గాల్లో బలమైన ప్రచారం జరుగుతోంది. సినిమా పూర్తయ్యే వరకూ తన మకాన్ని తాత్కాలికంగా ముంబైకి మార్చాలని, తద్వారా ప్రాజెక్టుపై మరింత ఏకాగ్రత పెట్టాలని ఆయన నిశ్చయించుకున్నట్లు తెలుస్తోంది.

ఈ భారీ బడ్జెట్ చిత్రంలో అల్లు అర్జున్ ఎన్నడూ చూడని విధంగా ఏకంగా మూడు విభిన్నమైన, సవాల్‌తో కూడుకున్న పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. అందులో ఒకటి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర కాగా, మరొకటి సగం మానవుడుసగం రాక్షస రూపం ఉన్న పాత్ర అని, మూడవది ఒక భావోద్వేగభరితమైన తండ్రి పాత్ర అని ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఇక ఈ సినిమాలో బన్నీ సరసన బాలీవుడ్ క్వీన్ దీపికా పదుకోనే కథానాయికగా నటిస్తున్నారు. అయితే, ఇటీవలే ఆమె తన రెండో గర్భాన్ని అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. 2024 సెప్టెంబర్‌లో మొదటి కుమార్తెకు జన్మనిచ్చిన దీపికా, ఇప్పుడు మరోసారి మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నప్పటికీ 'రాక' షూటింగ్‌కు ఏమాత్రం విరామం ఇవ్వకపోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గర్భిణీగా ఉండి కూడా ఎంతో రిస్క్ తీసుకుంటూ ఈ చిత్రంలోని అత్యంత క్లిష్టమైన, హైవోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లలో పాల్గొనడానికి ఆమె సంసిద్ధత వ్యక్తం చేయడం పట్ల నెటిజన్లు, సినీ ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. గతంలో 'కల్కి' సినిమా సమయంలోనూ గర్భంతోనే నటించి తన వృత్తి పట్ల అపారమైన నిబద్ధతను చాటుకున్న ఆమె, ఇప్పుడు 'రాక' కోసం కూడా అదే తపన కనబరుస్తుండటం విశేషం.



సన్ పిక్చర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాలో కళ్లు చెదిరే తారాగణం అలరించనుంది. రష్మిక మందన్న, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ వంటి అగ్రశ్రేణి హీరోయిన్లు కూడా ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. అంతేకాకుండా, దర్శకుడు అట్లీతో ఉన్న సాన్నిహిత్యం కారణంగా బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ సైతం ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అతిథి పాత్రలో మెరవనున్నారనే వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం.. హాలీవుడ్ స్థాయి టెక్నాలజీ, వరల్డ్ క్లాస్ విజువల్ ఎఫెక్ట్స్‌తో భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి ఎక్కించనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. 2026 చివరి నాటికి నిర్మాణ పనులన్నీ పూర్తి చేసుకుని ప్రేక్షకుల ముందుకు రానున్న 'రాక', భవిష్యత్తులో బాక్సాఫీస్ వద్ద ఇంకెన్ని కొత్త చరిత్రలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

# ఆర్టీసి సమ్మె లేకుండా చూస్తాం

## మంత్రి పొన్నం ప్రకటన

**కాళేశ్వరం, మహా:** ఆర్టీసి సమ్మె అంశంపై కాళేశ్వరం సభ వేదికగా మంత్రి పొన్నం కీలక ప్రకటన చేశారు. నిత్యం 60 లక్షల మంది ప్రయాణికులు, అందులో 35 లక్షల మంది మహిళలు, 35 లక్షల కి.మీ ప్రయాణం, 10వేల బస్సులతో పేద ప్రజలకు ఆర్టీసీ బస్సు లైఫ్ లైన్ అని.. దీనిని ఆగిపోనివ్వమని హామీ ఇచ్చారు. ఆర్టీసీ సమ్మె లేకుండా చూస్తామని అన్నారు. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణ మీదే తమ దృష్టి అని తెలిపారు. సమ్మెకు సిద్ధమవుతున్న వారిని సంప్రదించి సమ్మె లేకుండా చేస్తామన్నారు. మంగళవారం చెన్నై నుంచి డిప్యూటీ సీఎం వచ్చాక ఆర్టీసీ సమ్మె లేకుండా చూస్తామని మంత్రి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి నుండి ఆర్టీసి కార్మికులు సమ్మె తలపెట్టగా, మంత్రి పొన్నం చర్చలకు సిద్ధమని తేల్చిచెప్పారు.

# రేగుల గండి చెరువు వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి..

## ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, తహశీల్దార్ లకు వినతి పత్రాలు..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రేగుల గండి చెరువు వద్ద ప్రమాదాల నివారణకు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రజాభవన్‌లో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు, ప్రజావాణిలో తహశీల్దార్ అద్దంకి నరేష్‌కు, సింగరేణి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.డి నాసర్ పాషా మాట్లాడుతూ మణుగూరు ప్రాంతంలో ప్రకృతి అందాలతో అలరారే రేగుల గండి చెరువు వేసవికాలంలో యువకులు, పిల్లలను విపరీతంగా ఆకర్షిస్తోందన్నారు. అయితే చెరువు లోతు, సుడిగుండాలు, ఒడ్డు ప్రమాదకరంగా ఉండటం వల్ల ఈత రాని వారు మాత్రమే కాకుండా ఈత తెలిసిన వారు కూడా ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో అనేకమంది మృతి చెందగా, ఇటీవల నక్క హర్షవర్ధన్ అనే ప్రైవేటు పాఠశాల విద్యార్థి తోటి విద్యార్థులతో కలిసి ఈతకు వెళ్లి మునిగి మృతి చెందడం తీవ్ర విషాదానికి దారితీసిందన్నారు. మృతదేహాన్ని వెలికితీయడానికి పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ ఘటనతో మణుగూరు ప్రాంత ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చెరువు పరిసరాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారుల వెంట ఇనుప ముళ్ల కంచె ఏర్పాటు చేయాలని, ప్రమాదాలకు గల కారణాలను సమగ్రంగా అధ్యయనం చేయాలని కోరారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నీటిపారుదల శాఖ, మండల విద్యాశాఖ, పోలీసు శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మైనర్లు వాహనాలు నడపకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు కొడెం రాధా, పర్సిక రమణ, సున్నం భూలక్ష్మి, ఐఎఫ్‌టీయూ కార్యకర్తలు చల్ల కాంతారావు, బి రాజ్ కుమార్, ఆర్ శ్రీకాంత్, పి వెంకట్రావు, ఎండి లాల్ మొహమ్మద్, పి శ్రీనివాసరావు, డి దేవేందర్, నరసయ్య, అంగోత్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు, తాసిల్దార్లకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యాలు

## పెద్దిపల్లిలో జ్వర సర్వే.. అనుమానిత కేసు ల్యాబ్‌కు పంపిణీ..



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వలస ఆదివాసి గిరిజన గ్రామమైన పెద్దిపల్లిలో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య సిబ్బంది జ్వర సర్వే నిర్వహించారు. గ్రామంలో గృహ సందర్శనలు చేపట్టి ప్రతి ఒక్కరికి రాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్ (ఆర్ డి టి) ద్వారా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒకరిని అనుమానిత కేసుగా గుర్తించి నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపినట్లు వైద్య అధికారులు తెలిపారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతానికి ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని గ్రామస్థులకు సూచించారు. ఎవరికైనా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే గ్రామంలోని ఆశా కార్యకర్తల వద్ద అందుబాటులో ఉన్న ఓ ఆర్ ఎస్ ద్రావణాలు వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, శైలజ, నందిని, రోజా పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కూనంనేని పరామర్శించిన మద్దెల బృందం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** శస్త్ర చికిత్స అనంతరం హైదరాబాదు నుండి కొత్తగూడెంకు తిరిగి వచ్చిన స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుని సోమవారం ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ బృందం పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజలకు సేవలు అందించాలని ఎమ్మెల్యే సాంబశివరావుకు సూచించారు. ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో భారతరత్నఅంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు మాల మహానాడు రాష్ట్ర నాయకులు ఐ ఎన్ టి యు సి సెంట్రల్ కమిటీ మెంబర్ సబ్బారపు మధుసూదన్ చిన్ని, తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా రమేష్, జిల్లా నాయకులు బొమ్మెర అశోక్, మాల మహానాడు రాష్ట్ర మహిళా నాయకు రాళ్లుమేధిని లక్ష్మి, మేరుగు అనసూర్య, కరీష రత్నకుమారి, మందా నిర్మల తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు.., భూమి పూజలు..
- అశ్వాపురంలో పోషణ పక్వాడ.. స్మార్ట్ ఫోన్ల పంపిణీ..
- తల్లి-శిశు ఆరోగ్యంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, అశ్వాపురం మండలాల్లో సోమవారం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.మణుగూరు మండలం తోగ్గుడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహంలో లబ్ధిదారు అంకాల హైమావతి గృహప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, ఎమ్మెల్యే పూజా కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను అభినందించారు. ఇదే మండలంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో లబ్ధిదారు ఆడపు సరితకు మంజూరైన గృహ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చే దిశగా కృషి కొనసాగుతోందన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం చేయాలని ఆకాంక్షించారు. అశ్వాపురం మండలంలోని రైతు వేదికలో పోషణ పక్వాడ, స్మార్ట్ ఫోన్ల పంపిణీ, శ్రీమంతాల వేడుకలు, బాలికల పుట్టినరోజు కార్యక్రమాలు ఒకే వేదికపై నిర్వహించడం విశేషంగా నిలిచింది. అంగనవాడి టీచర్లకు 75 స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడం ద్వారా సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.గర్భిణీ స్త్రీలకు పోషకాహార కిట్లు అందజేయడం, చిన్నారుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా తల్లిశిశు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆడపిల్లల పుట్టినరోజులు జరుపడం ద్వారా సమాజంలో వారి ప్రాధాన్యతను చాటిచెప్పారు.ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.



## మానవత్వం చాటుకున్న ఆటో యూనియన్ సభ్యులు

**చర్ల మహా :** బస్టాండ్ ఆవరణలో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆవు దూడకు వైద్యం చేయించిన గణేష్ ఆటో యూనియన్ సభ్యులు.. గ్రూప్ లో పోస్ట్ ని చూసి స్పందించిన యూనియన్ అధ్యక్షులు పామర్ బాలాజీ వెంటనే వెటర్నటి డాక్టర్ కు సమాచారం అందించడంతో హుటా కొట్టిన వచ్చిన డాక్టర్ హరికాంత్ ఆవు దూడకు వైద్యం అందించి ఇంజక్షన్లు వేశారు. దూడను పరీక్షించిన డాక్టర్ హరికాంత్ దూడ వెనుక ఒక కాలు,,, వెన్నుపూస విరిగిపోయని, ఈరోజు అబ్జర్వేషన్ లో పెట్టి రేపు తగు వైద్యం అందించడం జరుగుతుందని తెలిపారు. అదేగా ఈ సందర్భంగా ఈయన అధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ మూగజీవాలైన పశువులను ఇష్టానుసారంగా యజమానులు రోడ్లపై వదిలిపెట్టరాదని, తమ పశువులను ఇళ్లల్లో కట్టి వేయవలనని, కాదని ఎవరైనా వదిలిపెడితే ఆటో యూనియన్ సభ్యులు పంచాయతీ అధికారులకు సమాచారం అందించి బందెల దొడ్డిలో పెట్టించడం జరుగుతుందని తెలిపారు.

# అక్రమంగా పశువులను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

**సీఐ సతీష్**



**బూర్గంపహాడ్ మహా :** అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పాల్వంచ సీఐ సతీష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోరంపల్లి బంజర్ గ్రామంలోని పశువుల సంత ప్రాంతంలో సర్పంచ్ బొర్రా సుభద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొనే మాట్లాడుతూ పశువులు తరలించే క్రమంలో సంబంధిత పత్రాలు ఉండాలని , రైతులకు సంబంధించినగేదెలను తరలించేటప్పుడు సంబంధిత వాహనంలో ఎక్కువ గేదెలను తరలించకుండా ట్రాలీ లాంటి ఆటోలో ఒకటి లేదా రెండు మినీ వ్యాన్ లాంటి వాటిలో కనీసం నాలుగు మాత్రమే తరలించే విధంగా ఉండాలని అవి కూడా అధికారుల అనుమతితో తరలించాలని కొనుగోలు చేసుకున్న వారు తమకి పాడికి సంబంధించిన గేదలను తరలించాలని అన్నారు. దూరప్రాంతాలకైతే అదే ఆటోలో పశువులకి మేత, మంచినీటిని అందుబాటులో ఉంచుకొని కొంత దూరం ప్రయాణించిన తర్వాత విశ్రాంతి కోసం ప్రయాణం ఆపి అదే క్రమంలో మేత మంచినీటిని అందించాలని సూచించారు. గర్భిణి తో ఉన్న గేదలు, లేదా అప్పుడే పుట్టిన గేదలను దూడ సహా తీసుకువెళ్లే క్రమంలో తప్పకుండా సంబంధిత వెటర్నటీ డాక్టర్ను సంప్రదించి వారి అనుమతులతో తరలించాలని సూచించారు. సంత ప్రాంతం నుండి పశువులను కటిక శాలలకు తరలించవద్దని అట్టి వారి పై నిఘా ఏర్పాటు చేస్తున్నామని తప్పకుండా అక్రమంగా తరలిస్తూ వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలతో పాటు కొన్ని కఠిన చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాలను తాము తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. వ్యవసాయానికి ఒక ఉపయోగపడే ఎద్దులు సంత ప్రాంతంలో కొనుగోలు చేసుకుని వెళ్లే క్రమంలో అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ఎలాంటి అనుమతి లేకుండా పలు వాహనాల్లో పశువులను తరలించే క్రమంలో గాయాలు పాలైన ఎక్కువ ఒక్కదానికొకటి ఆనుకొని తరలించిన అట్టి వాహనాన్ని సీజ్ చేయడమే కాకుండా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వారపు సంత ప్రశాంతంగా అధికారుల సూచనల మేరకు సంత నిర్వహించే నిర్వాహకులు నడుపుకోవాలని ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్సై నాగ బిక్షం, పంచాయతీ కార్యదర్శి భవాని, వెటర్నరీ డాక్టర్ రాజేందర్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు రెండా పుల్లారెడ్డి, యారం నాగిరెడ్డి,గ్రామ పెద్దలు సుబ్బరామిరెడ్డి, సీతారామరెడ్డి, దామోదర్ రెడ్డి, చేతుల పెద్ద రత్నం, సుబ్బారెడ్డి, నర్సిరెడ్డి, గ్రామస్తులు సంత నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

## జాతీయ విపత్తు స్పందన దళం కమ్యూనిటీ అవగాహనా కార్యక్రమం

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీలో జాతీయ విపత్తు స్పందన దళం సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వరదలు, అగ్నిప్రమాదాలు, సహజ విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి అనే అంశాలపై ప్రజలకు వివరణ ఇచ్చారు. అలాగే ప్రమాద సమయంలో స్వీయ రక్షణతో పాటు ఇతరులను ఎలా కాపాడాలనే విషయాలపై ప్రాక్టికల్ డెమో కూడా నిర్వహించారు. గ్రామస్తులు అత్యవసర నంబర్ల వినియోగం, ప్రాథమిక చికిత్స విధానాలు, సురక్షిత ప్రాంతాలకు తరలింపు చర్యల గురించి తెలుసుకున్నారు. ఈ అవగాహన కార్యక్రమం గ్రామ ప్రజల్లో మంచి స్పందనను పొందింది.ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆసుపత్రిలో అత్యాధునిక అవుట్‌సోర్స్ అంబులెన్స్ సేవలు ప్రారంభం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు అత్యుత్తమ అత్యవసర వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక అవుట్ సోర్స్ అంబులెన్స్ సేవలను సోమవారం ముఖ్య వైద్య అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా కసీఎంఓ అంబులెన్స్‌లోని వైద్య సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబులెన్స్‌లో అత్యవసర పరిస్థితుల కోసం వెంటిలేటర్ మల్టీపారా మానిటర్ డీఫిబ్రిలేటర్ ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయన్నారు.రోగిని మెరుగైన వైద్యం కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించే సమయంలో రోగిని ప్రాణాపాయం నుంచి తప్పించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ అత్యాధునిక అంబులెన్స్ అందుబాటులోకి రావడం వల్ల క్రిటికల్ కేర్ అవసరమైన రోగులను వేగంగా సురక్షితంగా ఉన్నత చికిత్స కేంద్రాలకు తరలించడానికి వీలవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఉన్నతాధికారులు వైద్యులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## సింగరేణి ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలలో ప్రతీ ఏడాది నిర్వహించే సమ్మర్ క్యాంప్ లలో భాగంగా ఈ ఏడాది కూడా సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో 18 సంవత్సరాలలోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు( బాలురు బాలికలకు)కొత్తగూడెం పరిసర ప్రాంతాల పిల్లలకు ఈ నెల 27వ తేదీ నుండి వచ్చేనెల 21 తేదీ వరకు అనుబవజ్ఞులైన శిక్షకులచే సమ్మర్ కోచింగ్ నిర్వహించబడుతుందని సింగరేణి జీఎం పర్సనల్ వెల్ఫేర్ జీవి కిరణ్ కుమార్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన పిల్లలు 27వ తేదీన సాయంత్రం 5.00 గంటలకు ప్రకాశం స్టేడియం నందు ప్రారంభం అయ్యే సమ్మర్ కోచింగ్ క్యాంప్ కి హాజరు అయి తమ పేర్లను నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని జివి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఆసక్తి గల ఉద్యోగుల పిల్లలు పాల్గొని క్రీడలలో నైపుణ్యం సంపాధించి ఈ వేసవి సెలవులను సద్వినియోగ పరచుకోవలసినదిగా కోరారు.

## ఐటీసీ భద్రాచలం పేపర్ బోర్డ్స్ వద్ద ఉధృతమైన ఐఎన్టీయూసీ నిరసన

**14వ ఎల్టీఏ జాప్యంపై కార్మికుల ఆగ్రహం – 8 గంటల నిరవధిక ధర్నా**

**బూర్గంపహాడ్ మహా :** భద్రాచలం పేపర్ బోర్డ్స్ యూనిట్ వద్ద INTUC మిత్రపక్షాల ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం భారీ నిరసన చేపట్టారు. 14వ LTA అమలులో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎనిమిది గంటలపాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ముందు ధర్నా నిర్వహించారు. ఎండను సైతం లెక్కచేయకుండా నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో ప్రాంతం మార్మోగింది. ఈ నిరసనకు యూనియన్ అధ్యక్షుడు గోనే రామారావు, ప్రధాన కార్యదర్శి యారం పిచ్చి రెడ్డి నాయకత్వం వహించారు. వారు మాట్లాడుతూ—పరిశ్రమ లాభాల్లో నడుస్తున్నప్పటికీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. మ్యాన్‌పవర్ తగ్గించి పని భారం పెంచే యత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గుర్తింపు సంఘానికీ హెచ్చరికలు జారీ చేస్తూ—కార్మికులను మోసగించవద్దని, గతంలో ఇచ్చిన హామీలను గుర్తుచేసుకోవాలని సూచించారు.



**కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇలా ఉన్నాయి:**

కనీసం ₹22,000 కంటే తక్కువ కాకుండా వేతన ఒప్పందం పూర్తి చేయాలి. మ్యాన్‌పవర్ కోతలు నిలిపివేయాలి. నూతన క్వార్టర్స్ నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలి. రిటైర్డ్, వైద్యం, విద్య, బదిలీ సమస్యలు పరిష్కరించాలి. తాత్కాలిక కార్మికులను పర్మనెంట్ చేయాలి. శ్రీరామనవమికి పేయిడ్ హాలిడే ప్రకటించాలి. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. డిపార్ట్ మెంట్ గ్రేడ్ల సమస్యలు పరిష్కరించాలి. పరిశ్రమ 50 సంవత్సరాల సందర్భంగా ప్రతి కార్మికునికి 10 గ్రాముల బంగారు నాణెం ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో INTUC మిత్ర పక్షాల నాయకులు, ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



**కారేపల్లి, మహా:** ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కారేపల్లి మండలం కొత్తకమలాపురంలో సోమవారం చోటుచేసుకుంది. కొత్తకమలాపురంకు చెందిన శాగంటి కృష్ణయ్య(46) వ్యవసాయం పెట్టుబడులు రాక గిట్టుబాటు కావటంలేదని ఖమ్మంలో వివిధ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. వ్యవసాయపెట్టుబడులకు తెచ్చిన అప్పులతో పాటు పిల్లల చదువులు, కుటుంబ గడవటానికి చేసిన అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అయ్యాయి. దీంతో మనస్థాపం గురైన కృష్ణయ్య కమలాపురంలోని ఇంటి వద్ద కలుపు మందు సేవించాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని ఖమ్మం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య స్వప్న, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



## ఘనంగా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు

**బూర్గంపహాడ్ మహా :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు సారపాకలో సోమవారం ఘనంగా నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి పినపాక నియోజకవర్గం సమన్వయకర్త పోటు రంగారావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అభివృద్ధి సంక్షేమం ప్రజలకు అందిస్తూ పార్టీని ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్న చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాళ్లూరి జగదీశ్వరావు, టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రచార కార్యదర్శి గల్లా నాగభూషయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాకర్ల సత్యనారాయణ, రాష్ట్ర టీ ఎన్ టి యు సి నాయకులు చావా మహేశ్వర్ రావు, సిహెచ్ వెంకటేశ్వరరావు, విశాలాంధ్ర బాబు, సుబ్బారావు, రామకిషోర్, రమణ నాయుడు, గల్లా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి


- అసెంబ్లీలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలి
- ఎమ్మార్వోకివినతిపత్రంసమర్పించిన చర్ల మండలం క్రిస్టియన్ ఫెలోషిప్



**చర్ల మహా :** దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాల (యస్ సి) హోదాను రద్దు చేయకూడదని, మతం మారినా కుల వివక్ష పోదని, కాబట్టి రిజర్వేషన్లు కొనసాగించాలని మండలం క్రైస్తవ ఫెలోషిప్ నాయకులు, శనివారం తహసిల్దార్ శ్రీనివాస్ కు మెమోరాండం సమర్పించి తమ ఆవేదన తెలియజేశారు. ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు (మతం మారితే యస్సీ హోదా రద్దు) నేపథ్యంలో, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని నిరసన కార్యక్రమాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.మతం మారినంత మాత్రాన దళితుల సామాజిక,ఆర్థిక పరిస్థితులు మారవని,కాబట్టి దళిత క్రైస్తవులకు యస్సి హోదా తొలగించొద్దని,బౌద్ధ, సిక్కు మతాల్లోకి మారిన దళితులకు ఎస్సీ హోదా వర్తిస్తున్నప్పుడు,క్రైస్తవ, ఇస్లాం మతాల్లోకి మారిన వారికి వర్తించకపోవడం వివక్ష అని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15లకు ఇది విరుద్ధమని పేర్కొన్నారు.మతం ఆధారంగా ఎస్సీ హోదాను నిరాకరించే 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను (1950 కన్స్టిట్యూషనల్ (షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఆర్డర్) సవరించి, దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదాను పునరుద్ధరించాలని, దళిత క్రైస్తవులపై అమల్లో ఉన్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని, లేదా వాటి పరిధి నుండి దళితులను మినహాయించాలని, దళితులు తమ ఇష్టానుసారంగా మతాన్ని ఎంచుకునే హక్కు కలిగి ఉండాలని, ఇతర వర్గాలైన ఓసి, బీసీ, ఎస్టీ లకు లేని మత పరిమితులు కేవలం ఎస్సీలకే ఎందుకు విధిస్తున్నారో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. బౌద్ధ, సిక్కు మతాల్లోకి మారిన దళితులకు ఎస్సీ హోదా కొనసాగుతుండగా, క్రైస్తవ్యాన్ని స్వీకరించిన దళితులకు దానిని నిరాకరించడం వివక్షకు నిదర్శనమని విమర్శించారు. ప్రెసిడెంట్ ఏం ప్రభుదాసు, సెక్రటరీ జి జాన్ పాల్, ట్రెజరర్ కే సంస్థాన్, సీనియర్ దైవజనులు యేసు జీవన్, జె కిరణ్, సిహెచ్ చింత సామ్యూల్ రాజు, ప్రేమానందం, ప్రభుదాసు, ఆనంద్ రాజు, సంతోష్, బి సురేష్, శ్రీనివాస్, కే ఆనంద్, బర్నబాసు, బండి విజయానంద్, పి ఆశీర్వాదం, జి.పాల్ రాజు, సిస్టర్ స్వాతి ప్రవీణ్,. టీ మార్క్, చర్ల మండల సేవకులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇల్లులు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మరియు సర్పంచ్ పూనెం కృష్ణ


**భద్రాచలం మహా :** భద్రాచలం సుభాష్ నగర్ కాలనీలో మరియు ముత్రాజ్ బజార్ కాలనీ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ... మరియు సర్పంచ్ పూణెం కృష్ణ గూడూరి. రాము .... మరియు పసుపులేటి .రమాదేవిల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే . రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల కోరిక నెరవేరుతున్న సందర్భంగా ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుమల రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్కకి, రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యేని గూడూరి రాము మరియు పసుపులేటి రమాదేవి గారి కుటుంబ సభ్యులు శాలువాతో సత్కరించారు... ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు...



సంపాదకీయం

# దక్షిణాది ఉనికికే పెను ప్రమాదం

భారత రాజకీయ ముఖచిత్రాన్ని, భౌగోళికప్రజాస్వామ్య సమీకరణాలను సమూలంగా మార్చివేయబోతున్న అత్యంత సంక్లిష్టమైన ఘట్టం 'డీలిమిటేషన్' (నియోజకవర్గాల పునర్విభజన). ఈ మహాక్రతువును ఒక రాజకీయ ఆయుధంగా మలచుకోవాలని చూసిన ప్రతిపక్షాలు, కనీస ముందుచూపు లేని అనాలోచిత నిర్ణయాలతో తమ రాజకీయ సమాధిని తామే కట్టుకున్నాయన్న నిష్ఠుర సత్యం ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. అధికార భారతీయ జనతా పార్టీ పన్నిన వ్యూహాత్మక పద్మవ్యూహంలో చిక్కుకున్న విపక్ష కూటమి, అటు దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని బలిచేయడంతో పాటు, ఇటు సగం ఆకాశమైన మహిళా లోకపు ఆగ్రహానికి కూడా గురైంది. ఇది స్వతంత్ర భారత రాజకీయ చరిత్రలోనే కమలనాథులు విసిరిన అత్యంత పదునైన 'మాస్టర్ స్ట్రోక్'.




ప్రజాస్వామ్య మూలస్తంభమైన చట్టసభల్లో ప్రజలకు దామాషా పద్ధతిలో సరైన ప్రాతినిధ్యం కల్పించడమే డీలిమిటేషన్ ప్రధాన ఉద్దేశం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81, 82 ప్రకారం, ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగే జనాభా లెక్కల ఆధారంగా ఈ పునర్విభజన జరగడం అనేది ప్రభుత్వాల ఐచ్ఛికం కాదు, ఒక రాజ్యాంగబద్ధమైన అనివార్యత. అయితే, ఇక్కడే ఒక చారిత్రక వైరుధ్యం దాగి ఉంది. విద్య, వైద్యం, పటిష్టమైన పాలనతో కుటుంబ నియంత్రణను అద్భుతంగా సాధించిన దక్షిణాది రాష్ట్రాలు.. జాతీయ స్థాయిలో తమ ఎంపీ సీట్లను కోల్పోయే ప్రమాదం ఉందని గ్రహించిన అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ, 1976లో సీట్ల సంఖ్యను పాతికేళ్ల పాటు ఫ్రీజ్ చేశారు. అనంతరం 2001లో వాజ్‌పేయి ప్రభుత్వం దీనిని 2026 వరకు పొడిగించింది.

గత అర్ధ శతాబ్దంగా ఒక 'టైమ్ బాంబ్'లా వాయిదా పడుతూ వస్తున్న ఈ గడువు ముగింపు దశకు చేరుకుంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ బిల్లు) ఈ డీలిమిటేషన్‌తో ముడిపడి ఉంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు కావాలంటే, పునర్విభజన జరగడం తప్పనిసరి. అనగా, ఇప్పుడు ఈ ప్రక్రియను అడ్డుకోవడం ఎవరి తరమూ కాదు.

ఈ అనివార్య పరిస్థితుల్లో భౌగోళిక, రాజకీయ సమీకరణాలను బేరీజు వేసిన కేంద్ర ప్రభుత్వం ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించింది. జనాభా తక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి గండికొట్టకుండా ఉండేందుకు.. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలనే అటూఇటూ మార్చకుండా, ఏకంగా పార్లమెంటు సీట్ల సంఖ్యను సుమారు 850కి పెంచేలా ఒక విస్తరణ సవరణను తీసుకువచ్చింది. ఇది దక్షిణాది గొంతుకను జాతీయ స్థాయిలో కాపాడే ఒక బలమైన రక్షణ కవచం.

కానీ, కేంద్రం తెచ్చే ఏ బిల్లునైనా వ్యతిరేకించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న డీఎంకే నేతృత్వంలోని విపక్షాలు, తీవ్రమైన అనాలోచిత నిర్ణయంతో ఈ 'సీట్ల విస్తరణ' బిల్లును పూర్తిగా అడ్డుకున్నాయి. పార్లమెంటు సాక్షిగా తాము ప్రభుత్వ నిర్ణయాన్ని వీగిపోయేలా చేశామని ప్రతిపక్ష నేతలు చంకలు గుద్దుకున్నారు. కానీ, వారు సాధించిన ఆ క్షణికావేశపు విజయమే, దక్షిణాది రాష్ట్రాల పాలిట ఉరితాడుగా మారుతుందని వారు ఏమాత్రం ఊహించలేకపోయారు. రాజకీయ చదరంగంలో ఎత్తులు వేయడం ఎంత ముఖ్యమో, ఎదుటివారి ఎత్తుగడలోని లోతును గ్రహించడం కూడా అంతే ముఖ్యం. విపక్షాలు అడ్డుకున్నది బీజేపీ బిల్లును కాదు, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని అన్న సత్యాన్ని వారు చాలా ఆలస్యంగా గ్రహించారు.విపక్షాల తొందరపాటు నిర్ణయంతో లోక్‌సభ విస్తరణ బిల్లు వీగిపోవడం వల్ల, ఇప్పుడు రాజ్యాంగంలోని 'డిఫాల్ట్ నిబంధనల' ప్రకారం కేవలం పచ్చి జనాభా లెక్కల ప్రాతిపదికన మాత్రమే సీట్ల కేటాయింపు జరగక తప్పని చారిత్రక దుస్థితి ఏర్పడింది. దీని పర్యవసానాలు దక్షిణాదికి అత్యంత భయానకంగా ఉండబోతున్నాయి.

జనాభా నియంత్రణలో పూర్తిగా విఫలమైన ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాలు అత్యధిక లోక్‌సభ సీట్లను తమ ఖాతాలో వేసుకోబోతున్నాయి. అదే సమయంలో జాతీయ జీడీపీకి సింహభాగం అందిస్తూ, జనాభాను సమర్థవంతంగా నియంత్రించిన తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలు తమ ప్రాతినిధ్యాన్ని భారీగా కోల్పోనున్నాయి. అభివృద్ధి సాధించినందుకు, దేశ ప్రగతికి బాటలు వేసినందుకు దక్షిణాదికి దక్కిన శిక్ష ఇది. ముఖ్యంగా ఈ విస్తరణను ముందుండి వ్యతిరేకించిన తమిళనాడు రాష్ట్రమే దీనికి అత్యధిక మూల్యం చెల్లించుకోక తప్పని విపత్కర పరిస్థితి దాపురించింది. జాతీయ రాజకీయాల్లో దక్షిణాది ప్రాధాన్యతను విపక్షాలు చేజేతులా నాశనం చేశాయన్న విమర్శలు మేధావుల వర్గాల నుంచి తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం ఎపిసోడ్‌లో బీజేపీ రాజకీయంగా అత్యంత లాభపడింది. "మేము దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా సీట్లు పెంచుదామనుకున్నాం, కానీ విపక్షాలే అడ్డుకుని ద్రోహం చేశాయి" అని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కమలనాథులకు స్పష్టమైన, తిరుగులేని ఆయుధం దొరికింది.

మరోవైపు, దేశ జనాభాలో సగభాగమైన మహిళలు సైతం విపక్షాలపై రగిలిపోతున్నారు. దశాబ్దాలుగా వేచిచూస్తున్న మహిళా రిజర్వేషన్ల ఫలాలు డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్నాయి. ఈ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా, పరోక్షంగా మహిళలకు చట్టసభల్లో దక్కాల్సిన 33 శాతం రిజర్వేషన్లను విపక్షాలు అడ్డుకుంటున్నాయనే సంకేతం దేశవ్యాప్తంగా బలంగా నాటుకుపోయింది. తమ సాధికారతకు విపక్షాలు గండికొడుతున్నాయని భావిస్తున్న మహిళల సానుభూతిని, ఓటు బ్యాంకును బీజేపీ తమ వైపు పూర్తి స్థాయిలో తిప్పుకోగలిగింది.

ఒకప్పుడు దేశ రాజకీయాలను శాసించిన ప్రాంతీయ, జాతీయ ప్రతిపక్షాలు సరైన వ్యూహం, ముందుచూపు లేకపోవడం వల్ల తమ గోతిని తామే తవ్వుకున్నాయి. అటు దక్షిణాది ప్రజల భవిష్యత్తును పణంగా పెట్టి, ఇటు మహిళా లోకానికి ద్రోహం చేసిన ముద్ర వేయించుకుని 'డీలిమిటేషన్' అనే వ్యూహాత్మక ఉచ్చులో విలవిలలాడుతున్నాయి. కమలనాథులు విసిరిన ఈ అప్రతిహతమైన చెక్‌మేట్‌తో విపక్షాలకు కోలుకోలేని రాజకీయ నష్టం వాటిల్లిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

- గడల నరసింహారావు,
సీనియర్ జర్నలిస్ట్, ఖమ్మం

# మహిళా రిజర్వేషన్ రాజకీయమా? సామాజిక న్యాయమా?

మహిళా సాధికారత అనే గొప్ప నినాదంతో ముందుకు తెచ్చిన Women's Reservation Bill 2023 పై ప్రాథమిక రాజకీయ ప్రతిస్పందనలోనే ప్రశంసల స్వరం వినిపించింది. కానీ లోతుగా పరిశీలిస్తే, ఇది కేవలం సామాజిక న్యాయం కోసం తీసుకున్న నిర్ణయం మాత్రమేనా, లేక రాజకీయ లాభాల కోసం వేసిన లెక్కచేసిన అడుగా అనే సందేహం తప్పకుండా తలెత్తుతుంది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ బిల్లును ప్రవేశపెట్టడం, సభ ముగిసిన వెంటనే బయట రాజకీయ హంగామా మొదలవడం ఇవి సహజసిద్ధమైన ప్రతిస్పందనలా కనిపించవు. ఒక ప్లాన్ ప్రకారం ప్రజల్లో భావోద్వేగాన్ని రేకెత్తించి, ముఖ్యంగా మహిళా ఓటర్లను ఆకర్షించాలనే రాజకీయ వ్యూహం ఉందనే అనుమానం బలపడుతోంది. మహిళల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమైతే, అమలు వెంటనే ప్రారంభమయ్యేలా ఎందుకు చేయలేదు అన్న ప్రశ్నకు సరైన సమాధానం కనిపించడం లేదు. సామాజిక కోణంలో చూస్తే, OBC మహిళలకు ప్రత్యేక ప్రాతినిధ్యం లేకపోవడం పెద్ద లోటు. ఇప్పటికే రాజకీయంగా, ఆర్థికంగా బలమైన వర్గాల మహిళలకే ఎక్కువ అవకాశాలు దక్కే పరిస్థితి ఉంటే, ఈ బిల్లు అసలు సమానత్వ లక్ష్యాన్ని ఎలా నెరవేర్చుతుంది? వెనుకబడిన వర్గాల మహిళలకు పోటీ చేసే స్థాయి, వనరులు లేకపోతే, ఇది మరోసారి అసమానతలను బలపరచే ప్రమాదం ఉంది.



చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల కోసం దశాబ్దాలుగా దాదాపు 75 ఏళ్లుగా పోరాటం కొనసాగుతోంది. ఇది కేవలం ఒక డిమాండ్ కాదు, సామాజిక న్యాయం కోసం నడిచే దీర్ఘకాల పోరాటం. కానీ ఈ ప్రశ్నను సీరియస్‌గా పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు, దాన్ని నిర్లక్ష్యం చేస్తూ వచ్చాయి.

ఇప్పుడు మహిళా రిజర్వేషన్ పేరుతో ఒక కొత్త రాజకీయ అజెండా ముందుకు వస్తోంది. లింగ అసమానతలు తొలగించాలి అనేది నిజమే. కానీ అదే సమయంలో, సామాజిక అసమానతలను పక్కన పెట్టి, "అందరికీ ఒకే రిజర్వేషన్" అనే రూపంలో చూపించడం ఒక రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. పైకి ఇది సమానత్వం లాగా కనిపించినా, లోతులో చూస్తే సామాజికంగా ముందున్న వర్గాలకే ఎక్కువ ప్రయోజనం దక్కే అవకాశాలు ఉన్నాయి.

ఈ చట్టాన్ని Delimitation ప్రక్రియతో అనుసంధానం చేయడం వల్ల, ఇది తక్షణంగా అమల్లోకి రాకుండా భవిష్యత్తుకు వాయిదా పడింది. అంటే, ప్రస్తుతం మహిళా సాధికారత పేరుతో రాజకీయంగా లాభం పొందే అవకాశం ఉండగా, నిజమైన ప్రాతినిధ్య మార్పు మాత్రం తరువాతికి వెళ్లింది. ఈ విరుద్ధ పరిస్థితి, ఈ బిల్లును కేవలం సంస్కరణగా కాకుండా ఒక రాజకీయ ఎత్తుగడగా కూడా చూడాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ బిల్లును ప్రవేశపెట్టడం యాదృచ్ఛికం కాదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. మహిళా ఓటర్లను ఆకర్షించడానికి, "మహిళల కోసం పనిచేసే ప్రభుత్వం" అనే ఇమేజ్‌ను బలపరచడానికి ఇది ఉపయోగపడుతుందనే రాజకీయ లెక్కలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 2026లో జరగబోయే రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో, ఈ నారేటివ్ ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

మహిళలందరినీ ఒకే వర్గంగా చూపించడం సులభం. కానీ వాస్తవం ఏమిటంటే, సామాజికంగా ముందున్న వర్గాల మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలు ఇద్దరూ ఒకే స్థాయిలో లేరు. ఒకరికీ అవకాశాలను ఉపయోగించుకునే వనరులు ఉన్నాయి మరొకరికీ ఇంకా ప్రవేశ ద్వారమే దొరకడం లేదు. అయితే ఒకే 33% రిజర్వేషన్‌లో అందరినీ పెట్టేస్తే అవకాశం ఉన్నవారే ముందుకు వస్తారు. అవకాశం కావాల్సినవాళ్లు మళ్లీ వెనకబడతారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళల స్థితిని అర్థం చేసుకోవాలంటే, వారి జీవితంలో పనిచేస్తున్న రెండు పరిమితులను గుర్తించాలి. ఒకటి కుల ఆధారిత వెనుకబాటు, మరొకటి లింగ ఆధారిత వివక్ష. ఈ రెండూ కలిసి వారి అవకాశాలను మరింత పరిమితం చేస్తాయి. అందుకే వారి పరిస్థితిని "double disadvantage"గా వర్ణిస్తారు. ఇలాంటి పరిస్థితిలో మహిళా రిజర్వేషన్ అమలు చేస్తూ, అందులో ఉపవిభజన లేకపోతే సమస్య మరింత క్లిష్టమవుతుంది. పైకి చూస్తే అన్ని మహిళలకు సమాన అవకాశాలు కల్పించినట్టే కనిపించినా, వాస్తవంగా అవకాశాలను వినియోగించుకునే సామాజిక, ఆర్థిక బలం ఉన్న వర్గాలకే ఎక్కువ ప్రాధాన్యం దక్కుతుంది. ఫలితంగా, ఇప్పటికే వెనుకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళల ప్రాతినిధ్యం మరింత తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇది న్యాయం సాధించే ప్రక్రియగా కాకుండా, అసమానతను కొత్త రూపంలో కొనసాగించే విధానంగా మారే అవకాశం ఉంది. అందుకే మహిళా రిజర్వేషన్ అనే ఆలోచనను సమర్థించేటప్పుడు, అందులో సామాజిక న్యాయం కోణాన్ని కూడా కలపడం అవసరం. లేకపోతే, ఇది నిజమైన సమానత్వానికి దారితీయకుండా, పాత అసమానతలను కొత్త ముసుగులో కొనసాగించే ప్రమాదం కలిగిస్తుంది.

లింగ న్యాయం పేరుతో తీసుకొచ్చే సంస్కరణలు, సామాజిక న్యాయం అనే విస్తృత లక్ష్యంతో కలిసి పోకపోతే, అవి పూర్తి అర్థాన్ని పొందలేవు. మహిళా రిజర్వేషన్ వంటి చర్యలు అవసరమే అయినప్పటికీ, సమాజంలోని అన్ని వర్గాల మహిళలకు సమానంగా ప్రయోజనం చేకూరేలా రూపకల్పన చేయడం కీలకం. లేకపోతే, ఈ విధానాలు పైకి సమానత్వాన్ని ప్రతిబింబించినా, లోతులో ఇప్పటికే ఉన్న సామాజిక అసమానతలను అలాగే కొనసాగించే ప్రమాదం ఉంటుంది. భారతీయ సమాజంలో కుల ఆధారిత అసమానతలు ఇంకా గాఢంగా ఉన్న నేపథ్యంలో, రిజర్వేషన్ విధానాలు కేవలం లింగాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని రూపొందితే, బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలు ఎదుర్కొనే ప్రత్యేక సమస్యలు పట్టించుకోబడకుండా పోవచ్చు. వారు ఇప్పటికే కుల పరంగా వెనుకబడి ఉండటంతో పాటు, లింగ వివక్షను కూడా ఎదుర్కొంటున్నారు. ఈ రెండు అంశాలను కలిపి చూడకుండా, ఒకే తరహా మహిళా రిజర్వేషన్ అమలు చేయడం వాస్తవ సమానత్వాన్ని అందించదు.

రాజకీయంగా కూడా ఇది ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతుంది. సులభంగా అమలు చేయగలిగే, విస్తృతంగా ఆమోదయోగ్యమైన నినాదాల ద్వారా సంస్కరణలు తీసుకురావడం ఒక వ్యూహం కావచ్చు. కానీ అది సామాజిక న్యాయం లక్ష్యాన్ని పూర్తిగా సాధించకపోతే, అది కేవలం పరిమిత మార్పుకే దారి తీస్తుంది. అసలు మార్పు అంటే, అధికారంలో అన్ని వర్గాల ప్రాతినిధ్యం పెరగడం, వారి స్వరాలు చట్టసభల్లో ప్రతిధ్వనించడం. అందువల్ల, లింగ న్యాయం మరియు సామాజిక న్యాయం పరస్పర విరుద్ధాలు కావు; అవి ఒకదానిని మరొకటి బలపరచాలి. రిజర్వేషన్ విధానాలు కూడా ఈ రెండు కోణాలను సమన్వయపరిచే విధంగా ఉండాలి. అప్పుడు మాత్రమే అవి నిజమైన సంస్కరణలుగా నిలుస్తాయి, లేకపోతే అవి సౌకర్యవంతమైన రాజకీయ నిర్ణయాలుగా మిగిలిపోతాయి.

పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం కోసం తీసుకొచ్చిన రిజర్వేషన్ బిల్లులో కుల ఆధారిత ఉపవిభజన లేకపోతే, ఆ సీట్లు నిజమైన ఒబిసి, ఎస్సీ, ఎస్టీ మహిళలకు చేరే అవకాశం తగ్గుతుంది. బదులుగా రాజకీయంగా బలమైన కుటుంబాల నుండి భార్యలు, కూతుళ్లు, కోడళ్లు పోటీకి వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ప్రాతినిధ్యం పెరిగినట్టే కనిపించినా, సామాజిక న్యాయం మాత్రం పూర్తిగా సాధ్యం కావడం కష్టం.

ఈ బిల్లును కేవలం మహిళా సాధికారత కోణంలో మాత్రమే కాకుండా, దాని వెనుక ఉన్న రాజకీయ లెక్కలు, అమలు ఆలస్యం, మరియు సామాజిక ప్రభావాలను కూడా సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. నిజమైన సమానత్వం అంటే కేవలం రిజర్వేషన్ ఇవ్వడం కాదు, అది అన్ని వర్గాల మహిళలకు సమానంగా ఉపయోగపడేలా నిర్మించడం. లేదంటే, ఈ బిల్లు ఒక శక్తివంతమైన నినాదంగా మాత్రమే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

- బసడ సంపత్ యాదవ్
70321 32593



# నీ విలువల కంటే ఎదుటివారి కథ గొప్పది కావచ్చు..

*షారుక్ ఖాన్ స్ఫూర్తిదాయక సందేశం*

ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది అభిమానులు ఉన్న షారుక్ ఖాన్ కేవలం ఒక నటుడు మాత్రమే కాదు, గొప్ప ఆలోచనాపరుడు కూడా. క్లిష్టమైన విషయాలను సైతం ఎంతో సరళంగా, చమత్కారంగా వివరించడం ఆయన ప్రత్యేకత. 2015 అక్టోబర్‌లో ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న సమయంలో షారుక్ చేసిన ప్రసంగం ఇప్పటికీ ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. తన జీవిత ప్రయాణంలో నేర్చుకున్న పాఠాలను విద్యార్థులతో పంచుకుంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు మళ్ళీ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

**గందరగోళం నుంచే స్పష్టత మొదలవుతుంది**

చాలామంది తమ కెరీర్ లేదా జీవితం విషయంలో ఏదైనా సందిగ్ధత ఎదురైతే భయపడిపోతుంటారు. కానీ షారుక్ ఖాన్ దీనిని మరో కోణంలో చూశారు. గందరగోళంగా ఉండటం తప్పు కాదని, నిజానికి అదే స్పష్టతకు పునాది అని ఆయన అభిప్రాయపడ్డారు. "జీవితంలో గందరగోళానికి గురైనా పర్వాలేదు. ఎందుకంటే ఈ ప్రపంచంలో ప్రతి స్పష్టతకూ మూలం ఆ గందరగోళమే. దాని గురించి ఎక్కువగా ఆందోళన చెందకండి. అలాగే, మీ ఆలోచనల పట్ల మీరు అతిగా స్పష్టంగా ఉంటూ, పక్కవారి అభిప్రాయాలను గౌరవించడం మానేసే స్థాయికి చేరుకోవద్దు" అని షారుక్ ఖాన్ పేర్కొన్నారు.

**మన విలువల కంటే మనస్తత్వమే ముఖ్యం**

మనందరికీ కొన్ని విలువలూ, నమ్మకాలూ ఉంటాయి. కానీ అవి మనల్ని ఇతరుల కంటే గొప్పవారిగా చేస్తాయనుకోవడం పొరపాటని కింగ్ ఖాన్ హెచ్చరించారు. విలువలు అనేవి కేవలం మనల్ని ఇతరుల కంటే భిన్నంగా చూపిస్తాయి తప్ప, మనల్ని పై స్థాయిలో ఉంచవని ఆయన గుర్తుచేశారు. ప్రతి సినిమా వెనుక ఒక కథ ఉన్నట్టే, ప్రతి మనిషి వెనుక ఒక జీవిత కథ ఉంటుందని, ఆ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. "ఎదుటివారి నుంచి సత్యాన్ని చూడటానికి ఎప్పుడూ ప్రయత్నించండి. మీ కథ ఎదుటివారి కథ కంటే గొప్పదని భావించే హక్కు మీకు లేదు" అంటూ మనుషుల మధ్య ఉండాల్సిన పరస్పర గౌరవం గురించి ఆయన హృదయానికి హత్తుకునేలా వివరించారు.

**నేటి సమాజానికి ఈ మాటలు ఎందుకు అవసరం?**

ప్రస్తుతం సోషల్ మీడియా యుగంలో మనం మనకు నచ్చిన అభిప్రాయాల మధ్యే బ్రతుకుతున్నాం. మనకు విరుద్ధమైన ఆలోచన ఉన్నవారిని తక్కువ చేసి చూడటం లేదా వారిపై ద్వేషం పెంచుకోవడం సర్వసాధారణమైపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో షారుక్ ఖాన్ చెప్పిన 'ఎదుటివారి సత్యాన్ని గౌరవించడం' అనే సూత్రం చాలా ముఖ్యం. కఠినమైన వాదనల కంటే సున్నితమైన సంభాషణలు, చర్చలే సమాజాన్ని ముందుకు నడిపిస్తాయని ఈ ప్రసంగం మనకు గుర్తుచేస్తోంది. ఎదుటి వ్యక్తి ఏ పరిస్థితుల్లో ఆ నిర్ణయం తీసుకున్నాడో తెలుసుకోకుండా తీర్పులు ఇవ్వడం మానేయాలని బాద్‌షా మాటలు మనల్ని మేల్కొల్పుతున్నాయి.


**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

## సీతారామ కాలువలతో..
# రైతులకు నష్టం జరగనివ్వం

- రీ-సర్వేకు ఆదేశాలు..
- రైతుల సమన్వయంతో పనులు..
- నియోజకవర్గంలో నిరంతర విద్యుత్ కు చర్యలు..
- సమీక్షల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, మహా :** సీతారామ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం వల్ల రైతులకు ఎటువంటి నష్టం జరగనివ్వబోమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.., బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర ప్రాంత రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని తెలిపారు.కాలువల నిర్మాణంతో సాగుభూములు నష్టపోతాయనే రైతుల ఆందోళనపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం ఇరిగేషన్ శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కాలువ పనులపై తక్షణమే రీసర్వే చేపట్టి, రైతుల భూములకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని అధికారులకు ఆదేశించారు. సర్వే సమయంలో రైతులతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేయాలని, అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా పనులు కొనసాగించాలని సూచించారు. ప్రతి ఎకరానికి సాగునీరు అందించడం ప్రభుత్వ లక్ష్యమని, అయితే ఆ ప్రక్రియలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు.

**నిరంతర విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు..**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో మరో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వేసవి కాలంలో ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్ సేవలను మరింత సమర్థంగా అమలు చేయాలని సూచించారు. లోవోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, గాలివానల కారణంగా విద్యుత్ అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యుత్ సరఫరా కోసం నిర్వహించే మెయింటెనెన్స్ పనులను ఉదయం 10 గంటలలోపు పూర్తి చేయాలని, మధ్యాహ్న వేళల్లో విద్యుత్ నిలిపివేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐదు మండలాల విద్యుత్ అధికారులకు సూచించారు. సమావేశాలలో ఇరిగేషన్ శాఖ డీఈలు, ఏఈలు, విద్యుత్ శాఖ నుంచి భద్రాచలం డివిజన్ డీఈ జీవన్ కుమార్, ఏడీఈలు ఉమామహేశ్వరరావు, లారెన్స్, వివిధ మండలాల ఏఈలు హాజరయ్యారు.

# వాటర్ ట్యాంక్ ఎక్కి గ్రామస్తుల నిరసన

- అధికారుల జోక్యంతో సద్దుమణిగిన నిరసన
- తుమ్మలకుంట చెరువు వివాదం



**కారేపల్లి, మహా :** చేపల చెరువు విషయమై అన్యాయం జరిగిందంటూ కారేపల్లి మండలం మేకలతండా గ్రామస్తులు సోమవారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన చేశారు. దుబ్బతండా గ్రామపంచాయతీలోని తుమ్మలకుంట చెరువు పట్టాభూమి, దేవాదాయ శాఖ భూములలో ఉందని దాని పేరుతో అక్రమంగా 2011లో మత్స్యశాఖ అధికారులు సోసైటీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారని పట్టా భూమి కల కుటుంబికులు వాదిస్తున్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీలోని ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తుంది. ఈక్రమంలో ఈనెల 18 న తేదిన తుమ్మలకుంట చెరువు కొందరు గ్రామస్తులు లూటి చేశారు. దీనిపై ఇరువర్గాలు పోలీసులకు పిర్యాదు చేశారు. పట్టాదారులమైన తమపైనే అక్రమంగా కేసులు పెట్టారంటూ కొందరు గ్రామస్తులు ఆరోపిస్తూ వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన చేశారు. తాసిల్దార్. ఎస్సై నిరసన ప్రాంతానికి చేరుకుని నిరసనకారులతో మాట్లాడారు ఏమైనా సమస్య ఉంటే లిఖితపూర్వకంగా ఇవ్వాలని దానిపై రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని తెలపడంతో నిరసనకారులు నిరసన ఇరమించారు దీనిపై పోలీసులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో అందోళన విరమించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను
# తక్షణమే పరిష్కరించాలి

- ఈ నెల 28న జిల్లాకు రాష్ట్ర సమాచార కమిషనర్లు..
- పెండింగ్ ఫైళ్లతో సిద్ధంగా ఉండాలి అదనపు కలెక్టర్ శ్రీనివాస్..



**నల్గొండ, మహా :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం వల్ల ఫిర్యాదుదారులకు మేలు జరుగుతుందని ఆ దిశగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం నాటి ప్రజావాణికి మొత్తం 104 ఫిర్యాదులు రాగా అందులో రెవెన్యూ శాఖకు 70, మిగిలిన ఇతర శాఖలకు 34 అర్జీలు అందినట్లు ఆయన వివరించారు.

**అవగాహన సదస్సుకు అంతా హాజరుకావాలి..**

రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషనర్లు ఈ నెల 28న జిల్లా కేంద్రానికి రానున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు (పీఐవోలు) అప్పీలేట్ అథారిటీ అధికారులు, ఇతర సంబంధిత అధికారులకు ఆర్టీఐ చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చట్టం అమలు విధానం, దరఖాస్తుల నిర్వహణ, సమాధానాల ప్రక్రియపై కమిషనర్లు సమగ్రంగా వివరించనున్నందున జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ముఖ్యంగా సెక్షన్ 4(1)(బి) కింద బహిర్గతం చేయాల్సిన సమాచారాన్ని అధికారులు ముందే నవీకరించి సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుత సంవత్సరంలో వచ్చిన దరఖాస్తుల వివరాలను నమోదు చేయాలని ఏవైనా దరఖాస్తులు లేని పక్షంలో 'నిల్'గా నమోదు చేయాలని సూచించారు. మధ్యాహ్నం సమయంలో కమిషనర్లు పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలిస్తారని అదనపు కలెక్టర్ వెల్లడించారు. కోర్టు కేసులు, విచారణలో ఉన్న అంశాలపై పూర్తి వివరాలతో కూడిన ఫైళ్లను సిద్ధం చేయాలని సంబంధిత పిటిషన్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రవెల్లి స్మృతివనంలో అధికారిక స్మరణం

### స్వేచ్ఛగా అమరులకు నివాళ్లు.. త్యాగాలను స్మరించుకున్న నేతలు అధికారులు



**ఆదిలాబాద్, మహా:** ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్మృతివనంలో సోమవారం ఘనంగా నిర్వహించిన స్మారక వేడుకలు ఆదివాసీలకు భావోద్వేగ క్షణాలను అందించాయి. 45 ఏళ్ల తర్వాత స్వేచ్ఛగా అమరులకు నివాళులర్పించుకునే అవకాశం లభించడంతో అధిక సంఖ్యలో గిరిజనులు హాజరై తమ గౌరవాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు అమరవీరుల స్తూపానికి పూజలు నిర్వహించి జెండా ఆవిష్కరించారు. అనంతరం స్తూపానికి పూలమాలలు వేసి అమరులకు ఘన నివాళులర్పించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరుల కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయం అందిస్తామని తెలిపారు. గిరిజనులకు భూహక్కులు ఆర్వోఎఫ్ఆర్ ద్వారా కల్పించామని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, స్మృతి వన అభివృద్ధి కోసం కాంపౌండ్ వాల్, సోలార్ కరెంట్, బోర్‌వెల్ వంటి సదుపాయాలు కల్పించామని చెప్పారు. స్మృతి వనాన్ని రూ.15 లక్షలతో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ఇళ్ల సమస్య, త్రీఫేజ్ విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ పీవో, అటవీ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు అత్రం భుజేంద్రరావు రచించిన "ఆ గాయానికి 44 ఏళ్లు" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, గిరిజనులకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ మహాసభల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా ఆడపిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ, స్మృతివన అభివృద్ధి పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. గిరిజన గ్రామాల్లో నీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి బోర్‌వెల్‌లు లేదా బావులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులు చదువు మానేయకుండా తల్లిదండ్రులు చైతన్యం కలిగి ఉండాలని, గ్రామ పటేళ్లు, సార్మేడి నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు, సార్మేడీలు, పటేళ్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి
# సంక్షేమ పథకాలు...

### డిప్యూటీ కమిషనర్ మల్లయ్య

**రాజేంద్రనగర్ మహా ;** అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం మహిళా గ్రూప్ సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అవగాహన సదస్సును కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించారు.ఈ సమావేశంలో పలు ప్రభుత్వ విభాగాలు రెవెన్యూ ,ఐసిడిఎస్, హెల్త్ ,బ్యాంకింగ్ ,బీసీ ,ఎస్టీ ,ట్రైబల్ మరియు మైనారిటీ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించి పథకాల వివరాలను మహిళా సభ్యులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మార్వో బొమ్మ రాములు, ఐసిడిఎస్ కవిత డిప్యూటీ డి ఎం హెచ్ వో డాక్టర్ పూనమ్,ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రాములు , ప్రాజెక్ట్ అధికారి కరుణాకర్, ఆర్ పి ఎస్ మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అటకెక్కిన కాముని చెరువు
# సుందరీకరణ...

### కేంద్ర నిధులు సుమారు మూడు కోట్లు.. ఎటు మళ్లాయి...

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని కాముని చెరువు సుందరీకరణ అటకెక్కింది. కేంద్రం నిధులు సుమారు మూడు కోట్ల రూపాయలతో కాముని చెరువును ఆహ్లాదకరంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. నిధులు కేటాయింపు జరిగిన పనులు ప్రారంభానికి నోచుకోని దుస్థితి నెలకొంది. మున్సిపాలిటీలో నిధులు మంజురైన జిహెచ్ఎంసి లో విలీనం తర్వాత సుందరీకరణ పేరే ఎత్తడంలేదు. జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యానికి నగరాలకు జీవమైన జలాశయాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.

**ఇదీ కాముని చెరువు ప్రస్తుత పరిస్థితి...**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని శంషాబాద్ కాముని చెరువును అమృత్ పథకం కింద సుందరీకరణకు నిధులు కేటాయించారు. నెలలు గడిచిన పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. చెరువు వద్ద బతుకమ్మ ఘాట్లు నిర్మించారు. సుందరీకరణ పేరుతో పలు విభాగాల అధికారులు కాముని చెరువును పర్యవేక్షించారు. శంషాబాద్ ప్రజలందరికీ కాముని చెరువును సుందరీకరణ చేపడుతున్నామని హడావిడి చేశారు. తీరా చూస్తే కామన్ చెరువులో గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. కేటాయించిన నిధులతో గుర్రపు డెక్క, ప్లాస్టిక్ ని సైతం తొలగించలేదు.

# జనగణన-2027కు ప్రజలు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్..తప్పడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవు

**నల్గొండ, మహా :** భారత జనగణన 2027 నిర్వహణకు సంబంధించి ప్రజలందరూ ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను సోమవారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. జనగణన చట్టం 1948, జనగణన నియమాలు 1990 ప్రకారం ఈ ప్రక్రియ దేశవ్యాప్తంగా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల స్థాయిలో గృహ పరిస్థితులు, జనాభా, విద్య, మతం, ఉపాధి, వలసలు మరియు జనన రేటు వంటి కీలక సమాచారాన్ని సేకరించే ఈ భారీ ప్రక్రియ ప్రభుత్వ విధానాల రూపకల్పనకు దిక్సూచిగా మారుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు మరియు వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఈ గణాంకాలే ప్రాతిపదిక అని వివరించారు.

**గోప్యంగా వ్యక్తిగత వివరాలు..**

జనగణన సమయంలో అధికారులు అడిగే ప్రశ్నలకు ప్రతి పౌరుడు తనకు తెలిసిన మేరకు సరైన సమాచారం ఇవ్వడం చట్టబద్ధమైన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళల వ్యక్తిగత వివరాల విషయంలో తగిన గౌరవం కాపాడబడుతుందని భరోసా ఇచ్చారు. ప్రతి గృహ యజమాని గణన అధికారులకు సహకరిస్తూ, గుర్తులు లేదా సంఖ్యలు వేయడానికి అనుమతించాలని వారు ఇచ్చే ఫారాలను నిక్కచ్చిగా పూర్తి చేసి సమర్పించాలని కోరారు. జనగణన ద్వారా సేకరించిన వ్యక్తిగత సమాచారం అత్యంత గోప్యంగా ఉంచబడుతుందని దీనిని ఎటువంటి కోర్టుల్లోనూ సాక్ష్యంగా ఉపయోగించే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..**

జనగణన విధులకు అంతరాయం కలిగించినా, అధికారులకు ప్రవేశం నిరాకరించినా లేదా కావాలని తప్పుడు సమాచారం ఇచ్చినా చట్టపరంగా శిక్షార్హులవుతారని కలెక్టర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారికి జరిమానా లేదా జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో కీలకమైన ఈ జాతీయ కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.


## మేడే గోడ పత్రిక విడుదల చేసిన జిల్లా ఏఐటీయూసీ నాయకులు జైపాల్ రెడ్డి



**రాజేంద్రనగర్, మహా :** అత్తాపూర్ సర్కిల్ పరిధిలో 141 వ మే డే కు సంబంధించిన గోడపత్రికను కార్మికులతో కలిసి రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి సోమవారం విడుదల చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాడి హక్కులను సాధించుకోవాలన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను తొలగించేంతవరకు ప్రతి ఒక్క ఉద్యమంలో పాల్గొనాలన్నారు. సమస్యలపై అనునిత్యం పోరాడ ఏకైక సంస్థ ఏఐటియుసిలో చేరండి మేడేను విజయవంతం చేయండి అన్నారు. కార్యక్రమంలోమండల అధ్యక్షులు సాయిలు, ఉపాధ్యక్షులు రాజు, ఎస్ఎఫ్ఏల అధ్యక్షులు చందు, వినయ్, చంద్రమోహన్, కృష్ణ, రాజు, ఎల్లప్ప, జగదీష్, శంకర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి...
- సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు...



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 48 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం చేయకుండా ఉండకూడదని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి( రెవెన్యూ),జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ లో అట్టహాసంగా హిందూ సమ్మేళనం...



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ లో ఆదివారం హిందూ సమ్మేళనం అట్టహాసంగా నిర్వహించారు. సమ్మేళనంలో హిందువులు వందలాదిగా తరలిరావడంతో రాజేంద్రనగర్ ఆధ్యాత్మికతతో నిండిపోయింది.మాణికేశ్ ధర్మార్చెడ్ కు చెందిన శంకర్ స్వామీజీ, సాదు పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు, బ్రహ్మర్షి రేవల్లి రాజుశర్మ, చండీ ఉపాసకులు వేద ప్రకాశ్లు హాజరయ్యారు. శివాలయంలోప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులతో కలిసిజ్యోతి ప్రజ్వలన చేసి హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామీజీ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుకుంటూ సుఖ సంతోషాలతో ప్రశాంతంగా ఉండాలి. ధర్మాన్ని కాపాడుకుంటూ ధార్మికతను ప్రజల్లో చైతన్యం తేవాలంటే ఇలాంటి సమ్మేళనాల ఎంతో అవసరమన్నారు.జై శ్రీరామ్ అనే నినాదాలతో రాజేంద్రనగర్ మారుమోగింది.సృష్టి ఆరంభం నుంచే సనాతన ధర్మం ఉంది. హిందూ సంస్కృతి ఎంతో పురాతనమైనదన్నారు.ప్రపంచంలోనే కొన్ని దేశాలు తమపై దాడి జరిగిన వెంటనే మతాలను మార్చుకోవడం జరుగుతుంది.భారతదేశంలో ఎన్నో దాడులు జరిగినా మన హిందూ సంస్కృతి సాంప్రదాయాలు సనాతన ధర్మం మాత్రం కొనసాగడం సనాతన ధర్మం యొక్క గొప్పతనం అన్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్ఎస్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ఇంటర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** ఇంటర్ ఇడియట్ ఫలితాలలో మంచిర్యాల జిల్లా మైనారిటీ పాఠశాల, కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, ఆర్.ఎల్.సి. ఆసిఫాబాద్,మంచిర్యాల జిల్లా షగుఫ్తా ఫిర్దౌస్ లతో కలిసి మైనారిటీ విద్యాసంస్థల విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాలలో జిల్లా బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్ మైనారిటీ పాఠశాల, కళాశాలలలో 202526 సంవత్సరంలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని వెల్లడించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులలో రాణించి, అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోనే మంచిర్యాల మైనార్టీ విద్యార్థులు రెండవ స్థానంలో నిలువడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించడంలో అధ్యాపకులు, ప్రిన్సిపల్స్ చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ తహారుద్దీన్, అకాడమిక్ సమన్వయకర్త రిజ్వాన్, మంచిర్యాల ప్రిన్సిపల్ సంధ్యా, బెల్లంపల్లి ప్రిన్సిపల్ యం.డి.నీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎలుకల మందు తిని
# బాలిక ఆత్మహత్య

**కారేపల్లి, మహా :** ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఫెయిల్ అయ్యానని బాలిక ఎలుక మందు త్రాగగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం దుబ్బతండాలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గుగులోత్ బాలాజీ 'అరుణ దంపతుల పెద్ద కుమార్తె అయిన గుగులోత్ సంజన(17) కారేపల్లిలో తాతయ్య ఇంట్లో ఉంటూ ఇంటర్ చదువుతుంది. ఇటీవల ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాలలో ఫెయిల్ కావటంతో మనస్థాపం చెందిన సంజన ఈనెల 17వ తేదిన ఎలుక మందు తిన్నది. వెంటనే అమెను ఖమ్మం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది.

## మంచిర్యాల జిల్లాలో
# దారుణం

- రెండువందలివ్వలేదని దంపతులపై దాడి
- భర్త మృతి, మృత్యువుతో పోరాడుతున్న భార్య

**ఆదిలాబాద్ మహా :** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామం లో దారుణం చోటు చేసుకుంది .కేవలం రెండు వందల రూపాయల కోసం ఓ నిండు ప్రాణం బలైన ఘటన కలకలం రేపింది. చిల్లర డబ్బుల కోసం జరిగిన గొడవ చివరకు హత్యకు దారితీసింది.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేట గ్రామానికి చెందిన బిళ్ల శంకరయ్య తన నివాసం వద్దే ఒక చిన్న కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శంకరయ్య వద్దకు వచ్చి ₹200 రూపాయలు అప్పుగా ఇవ్వాలని అడిగాడు. అందుకు శంకరయ్య నిరాకరించడంతో ఆగ్రహానికి గురైన ఆ వ్యక్తి, దంపతులిద్దరిపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు.నిందితుడి దాడిలో శంకరయ్యతో పాటు అతని భార్య తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బిళ్ల శంకరయ్య ప్రాణాలు కోల్పోయాడు. అతని భార్య ప్రస్తుతం తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతోంది.పోలీసులు విచారణ చేపట్టి నిందితుని కోసం గాలిస్తున్నారు.



# మహనీయుల జాతర విజయవంతం చేయాలి

- సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్
- చేవెళ్ల పట్టణంలో జాతర పోస్టర్ ఆవిష్కరణ
- ఈ నెల 30న చలో చేవెళ్ల...

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మహనీయుల జయంతిని పురస్కరించుకొని, ఈనెల 30న జాతరను విజయవంతం చేయాలని చేవెళ్ల కేంద్రంలో అల్లి దేవేందర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల పట్టణ కేంద్రంలో మహనీయుల జాతర పోస్టర్ ఆవిష్కరణ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, అంబేద్కర్ యువజన సంఘం చేవెళ్ల అధ్యక్షులు సున్నపు ప్రవీణ్ మాట్లాడుతూ.... ఈ నెల 30న చేవెళ్లలో జరిగే మహనీయుల జాతరను, కులాలకు మతాలకు అతీతంగా బహుజనులు అందరూ ఏకమై వేల సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న కుల అసమానతలపై, కుల దురహంకార హత్యలపై దళితులకు జరుగుతున్న అన్యాయాలపై దళిత, బహుజనులు ఏకమై ఐక్యమత్యంతో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్రం వచ్చి ఎన్నో సంవత్సరాలు గడిచినా, ఇప్పటికీ దళిత బహుజనులు పేదరికంలోనే ఉన్నారని, వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే పాలకవర్గాలు చూస్తున్నాయని అన్నారు. దళిత బహుజనుల రాజ్యాధికారం కోసం యువతరం కృషి చేయాలని అన్నారు.


## గ్రీవెన్స్ కు
# 55 దరఖాస్తులు

**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి , వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 55 అర్జీలను స్వీకరించారు.... ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 40,మున్సిపాలిటీ 5, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 2, జిల్లా పంచాయతీ 2, జిల్లా విద్యా శాఖ 2, కోఆపరేటివ్, ఎస్సీ కార్పొరేషన్, చేనేత, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
06
మంగళవారం, హైదరాబాద్ | 21-04-2026
జిల్లా వార్తలు | DISTRICT NEWS
WWW.MAHAADAILY.COM

## జిల్లాలో హీట్‌వేవ్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి
- ఎండల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి
- బస్సు స్టాండ్ రైల్వే స్టేషన్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి
- సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు: కలెక్టర్




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రస్తుతం వేసవి కాలం అయినందున జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నందువలన తగు జాగ్రతలు తీసుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతో వేసవి తీవ్రత (హీట్‌వేవ్) నేపథ్యంలో సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రత (హీట్‌వేవ్) దృష్ట్యా పలు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, వేసవి కాలంలో మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అత్యవసర పరిస్థితులు లేకపోతే బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. బయటకు వెళ్లే సందర్భంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలు తరచుగా నీరు, మజ్జిగ, పండ్లరసాలు వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు మరియు గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. హీట్‌వేవ్ ప్రభావం వల్ల అలసట, తలనొప్పి, వాంతులు, చెమటలు ఎక్కువగా పట్టటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. కూలీలు, కార్మికులు ఉదయం మరియు సాయంత్రం సమయాల్లోనే పనులు నిర్వహించుకోవాలని, సంబంధిత అధికారి తగిన చర్యలు తీసుకోవాలని, బస్సు స్టాండ్ , రైల్వే స్టేషన్ ల దగ్గర చలివేంద్రాలు ఏర్పాటు చేయాలనీ, వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో షెడ్లు, తాగునీరు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలనీ సంబంధిత అధికారికి కలెక్టర్ సి నారాయణరెడ్డి సూచించారు. జిల్లాలోనీ గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలో హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ దవఖానాలలో డాక్టర్లు, సిబ్బంది మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వేసవి కాలం కావడంతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశములో అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డిఆర్ఓ సంగీత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాకు ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పురం, మాందాపురం, నాతాళ్ళగూడెం, అక్కంపల్లి, లింగరాజుపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను సోమవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునే విధంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. గత సంవత్సరంలో సుమారు 3 లక్షల 77 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు, ఈ సంవత్సరం సుమారు 4 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. రైతులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు వడ్లపై క్వింటాల్‌కు ₹ 500 బోనస్ అందిస్తున్నామని వెల్లడించారు. ఈ చర్య రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తుందని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, మాయిశ్చర్ మీటర్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, ధాన్యం తేమ శాతం పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతులు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసి, చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కేంద్రాల వద్ద తాగునీరు, ఇతర కనీస సదుపాయాలు కల్పించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, ఐకేపీ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ, మండల పరిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**చలివేంద్రం ప్రారంభం:**

యాదగిరిగుట్ట పట్టణంలోని బస్ స్టాండ్ మరియు పాతగుట్ట రోడ్డులో వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు ఉపశమనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**సీసీ రోడ్డు పనుల ప్రారంభం**

యాదగిరిగుట్ట పట్టణంలోని 2వ వార్డు, 3వ వార్డుల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రహదారి సౌకర్యాలు మెరుగుపడటం వల్ల ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు.

**గౌరాయపల్లి గ్రామ అభివృద్ధి పనులు:**

యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

**ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం:**

రైతులకు మద్దతు ధర కల్పించే లక్ష్యంతో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

**100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ**

యాదగిరిగుట్టలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడం కోసం 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేశారు. భవిష్యత్తులో ఈ ఆస్పత్రి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

**వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణ:**


యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన శ్రీ వడ్డే ఓబన్న విగ్రహాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను స్మరించుకున్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం:**

పట్టణంలో నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు పట్టు బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడం ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యాదగిరిగుట్ట ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, వ్యవసాయం, గృహ నిర్మాణం వంటి అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల అవసరాల మేరకు మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ వాణి భరత్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం, నాణ్యమైన భోజనంపై దృష్టి సారించాలి

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** పాఠశాలలో పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో సోమవారం భువనగిరి కేంద్రంలో కేజీబీవి బాలికల పాఠశాలను సందర్శించారు . మొదటి రోజున సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల వంట గదులు, పరిసరాలు, పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, ఆహార నాణ్యత ను పరిశీలించారు. పాఠశాలలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం శుభ్రంగా, రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. వంటకు ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సరుకులు నాణ్యతతో ఉండాలని తెలిపారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్యం పరిస్థితిని పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసి విద్యా ప్రమాణాలను పెంపొందించాలని సూచించారు.

# కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ వేగవంతం

- అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్ పేర్లు మార్చారు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ అడ్డుకునేందుకే హరీశ్‌రావు ఢిల్లీ టూర్
- మేడిగడ్డపై అధికారులతో సమీక్ష అనంతరం సీఎం సంచలన వ్యాఖ్యలు
- ఎన్డీఎస్ఏ అనుమతులతోనే ఇకపై పనులు జరగాలని అధికారులకు ఆదేశం



**కాళేశ్వరం,మహా:** వివాదాస్పద కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, తదనంతర పరిణామాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల భవితవ్యంపై కాళేశ్వరంలోని ఎల్ అండ్ టీ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన ఆయన, బ్యారేజీల లోపాలు, పరిష్కార మార్గాలపై ఒక స్పష్టత వచ్చిందని తెలిపారు. సమస్యను పూర్తిగా అర్థం చేసుకోవడమే సగం పరిష్కారమని పేర్కొన్న సీఎం.. ఇకపై ప్రాజెక్టు వద్ద జరిగే ప్రతి పనీ కచ్చితంగా నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) మార్గదర్శకాలకు అనుగుణంగానే జరగాలని, ప్రతి చర్యకు వారి ముందస్తు అనుమతి తప్పనిసరని అధికారులను కఠినంగా ఆదేశించారు. సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాత ప్రాజెక్టును యథాతథంగా కొనసాగిస్తే తనకు ఎలాంటి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు దక్కవనే దురుద్దేశ్యంతోనే, నాటి సీఎం కేసీఆర్ ప్రాజెక్టు పేరు మార్చారని, అలాగే అంచనా వ్యయాన్ని అమాంతం పెంచేసి భారీ అవినీతికి తెరతీశారని ఆరోపించారు. కేవలం రూ. 34 వేల కోట్ల అంచనాతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టును ఏకంగా రూ. 1.50 లక్షల కోట్లకు పెంచేశారని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీలో తీవ్ర లోపాలు ఉన్నాయని 2020లోనే ఇంజినీర్లు రాతపూర్వకంగా హెచ్చరించినప్పటికీ, నాటి ముఖ్యమంత్రి కానీ, నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కానీ ఏమాత్రం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. 2023 అక్టోబర్‌లో బ్యారేజీ కుప్పకూలిపోయినప్పటికీ, అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు ఆ నిజాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేశారని, కానీ ప్రకృతి సహకరించకపోవడంతో అది పూర్తిగా కుంగిపోయి ప్రపంచానికి అసలు నిజం తెలిసిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు.

**సీబీఐ విచారణకు భయపడే హరీశ్ రావు ఢిల్లీ టూర్..**

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణలో కదలిక వచ్చిందని, అందుకే దాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారని సీఎం ఆరోపించారు. సీబీఐ విచారణ వేగవంతం అవుతోందన్న భయంతోనే మాజీ మంత్రి హరీశ్‌రావు హడావుడిగా ఢిల్లీకి వెళ్లి కేంద్ర పెద్దల కాళ్లు పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి 9 నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని, సీబీఐ ఇప్పటికీ విచారణ ప్రారంభించలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గతంలో 48 గంటల్లోనే సీబీఐ విచారణకు ఆదేశిస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. కాళేశ్వరం కమిషన్‌పై కోర్టులో తీర్పు ఇప్పటికే రిజర్వ్ అయిన నేపథ్యంలో, ఇప్పుడు ఢిల్లీ వెళ్లి లాయర్లతో చర్చించడానికి ఏముంటుందని బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఏది ఏమైనా లక్ష కోట్లు ఖర్చు పెట్టిన ప్రాజెక్టును వృథాగా పోనీయబోమని, మరమ్మతులు పూర్తి చేసి వాడుకలోకి తెచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజీ వద్ద కుంగిన ఏడో బ్లాక్ ప్రాంతాన్ని, పియర్స్ వద్ద జరుగుతున్న డ్రిల్లింగ్, శాంపిల్ సేకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్‌తో కలిసి బ్యారేజీని పరిశీలించిన ఆయనకు.. అధికారులు జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షల వివరాలను, బోర్ బ్లెస్ట్ జీటెక్ టెస్ట్, క్రాస్ హోల్ సెస్మిక్ టెస్ట్ విధానాలను వివరించారు. మొత్తం 520 శాంపిళ్లను సేకరించి సీడబ్ల్యూఆర్పీఎస్ కు పంపుతామని, ల్యాబ్ రిపోర్టుల తర్వాత బ్యారేజీ డ్యామేజీపై పూర్తి స్పష్టత వస్తుందని అధికారులు సీఎంకు తెలిపారు. కాగా, ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ముందుగా శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ. 198 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి ఆయన భూమి పూజ చేశారు.

## విదేశీ మోజు వద్దు.. స్వదేశీ విధానమే ముద్దు

- ఇండియన్ టాయిలెట్ ప్రయోజనాలను వివరిస్తున్న ఉపాసన కొణిదెల
- వేల కోట్ల ఆస్తి ఉన్నా ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అంటున్న మెగా కోడలు
- పాశ్చాత్య టాయిలెట్లకు స్వస్తి పలకాలని పిలుపు



**హైదరాబాద్, మహా:** మెగా కోడలు, అపోలో లైఫ్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల తన వినూత్న ఆలోచనలతో, ఆరోగ్యకరమైన జీవనశైలి సూచనలతో ఎప్పుడూ ముందుంటారు. తాజాగా ఆమె నేటి యువతకు, ప్రస్తుత తరానికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ మరో అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాశ్చాత్య సంస్కృతి వ్యామోహంలో పడి మన దేశీయ పద్ధతులను మర్చిపోతున్న ప్రస్తుత విలాసవంతమైన సమాజానికి, మన పాత పద్ధతుల్లో దాగున్న ఆరోగ్య రహస్యాలను ఆమె సోదాహరణంగా వివరిస్తున్నారు. ఇందులో భాగంగానే విదేశీ టాయిలెట్ (వెస్ట్రన్ కమోడ్) వాడకానికి స్వస్తి పలికి, మన భారతీయ టాయిలెట్ (స్క్వాటింగ్) విధానాన్ని అలవాటు చేసుకోవాలని ఆమె ప్రత్యేకంగా ప్రచారం చేస్తుండటం సర్వత్రా ప్రశంసలందుకుంటోంది. కేవలం చెప్పడమే కాకుండా, ఇండియన్ టాయిలెట్ విధానాన్ని ఎందుకు వాడాలో, దానివల్ల మన శరీరానికి కలిగే అసంఖ్యాకమైన ప్రయోజనాలను ఉపాసన కొణిదెల వివరిస్తున్నారు. విదేశీ టాయిలెట్ విధానం వల్ల పైల్స్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుందని, శరీర భంగిమ సరిగ్గా ఉండకపోవడం వల్ల పేగులపై సరైన ఒత్తిడి పడదని తెలుస్తోంది. అదే మన స్వదేశీ టాయిలెట్ విధానంలో కూర్చోవడం వల్ల పొట్టపై సహజమైన వత్తిడి పడుతుంది. ఇది జీర్ణక్రియ సాఫీగా సాగేందుకు తోడ్పడటమే కాకుండా పొట్టకు ఒక మంచి వ్యాయామంలా సైతం పనిచేస్తుంది. మలబద్ధకం, పైల్స్ వంటి దీర్ఘకాలిక సమస్యల నుంచి ఇది సహజ సిద్ధంగానే కాపాడుతుందని ఆమె తన ప్రచారంలో స్పష్టం చేస్తున్నారు. వేల కోట్ల రూపాయల ఆస్తులకు అధిరాలిగా ఉన్నప్పటికీ, ఏమాత్రం బేషజాలకు పోకుండా ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా అపోలో లైఫ్ పేరిట ఆమె స్వయంగా ఈ విధానాలను ప్రమోట్ చేయడం నిజంగా ఎంతో స్ఫూర్తిదాయకం. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు తన వంతు బాధ్యతగా, సమాజం పెద్దగా మాట్లాడుకోవడానికి ఇష్టపడని ఇలాంటి చిన్న విషయాల్లో కూడా ఆమె ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో ఈ చర్య ద్వారా స్పష్టమవుతోంది. ఆరోగ్యం పట్ల అపారమైన శ్రద్ధతో సమాజానికి మేలు జరిగే విషయాలను ధైర్యంగా పంచుకుంటున్న ఉపాసన కొణిదెల ఆలోచనా విధానం, సామాజిక బాధ్యత పట్ల ప్రతి ఒక్కరూ హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.


## ఢిల్లీకి బీఆర్ఎస్ త్రిసభ్య కమిటీ

- కాళేశ్వరం, ఫిరాయింపుల కేసులపై సుప్రీం లాయర్లతో కీలక మంతనాలు
- న్యాయ పోరాటానికి గులాబీ దళం సన్నద్ధం
- కేసీఆర్ ఆదేశాలతో హస్తినకు హరీశ్ రావు బృందం
- ఢిల్లీలో సీనియర్ న్యాయవాదులతో ముమ్మర చర్చలు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ, న్యాయపరమైన పరిణామాల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధిష్ఠానం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. రాబోయే న్యాయపరమైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గులాబీ దళం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ త్రిసభ్య కమిటీ హస్తినకు పయనమైంది. కీలకమైన కేసుల్లో తదుపరి తీసుకోబోయే న్యాయపరమైన కార్యాచరణను సిద్ధం చేసేందుకు ఈ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం ఢిల్లీలో మకాం వేసింది. ఈ బృందంలో మాజీ మంత్రి, అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన విచారణ కమిషన్, అలాగే ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసుల వ్యవహారం ఇప్పుడు న్యాయస్థానాల పరిధిలో అత్యంత కీలక దశకు చేరుకున్నాయి. కాళేశ్వరం కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై ఈనెల 22వ తేదీన (సోమవారం) తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం (హైకోర్టు) తుది తీర్పును వెలువరించనున్నట్లు తెలుస్తోంది. ఈ తీర్పు రాజకీయంగా, చట్టపరంగా అత్యంత కీలకం కానున్న నేపథ్యంలో, ముందస్తుగానే అన్ని రకాల న్యాయపరమైన ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకోవాలని బీఆర్ఎస్ అధిష్ఠానం భావిస్తోంది. హైకోర్టు తీర్పు కాపీ వెలువడిన వెంటనే దానికి అనుగుణంగా స్పందించేలా పకడ్బందీ ప్రణాళికను రచిస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే హరీశ్ రావు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ ఢిల్లీలో సుప్రీంకోర్టుకు చెందిన పలువురు సీనియర్, ఉద్దండ న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘ మంతనాలు జరిపింది. కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు నుంచి రాబోయే తీర్పును బట్టి, ఒకవేళ అవసరమైతే ఏమాత్రం కాలయాపన చేయకుండా తక్షణమే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలపై న్యాయవాదులతో లోతుగా చర్చించారు. దీనితో పాటుగా, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి ఫిరాయించిన వ్యవహారంపై కూడా న్యాయవాదులతో బృందం చర్చించింది. ఫిరాయింపులకు పాల్పడిన శాసనసభ్యులపై అనర్హత వేటు వేయించే దిశగా, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఆధారంగా న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి కఠిన చర్యలపై న్యాయవాదుల సలహాలు, సూచనలు తీసుకున్నారు.

## బసవేశ్వరుడు అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాడు

**రెవెన్యూ కలెక్టర్ వెంకా రెడ్డి**



**యాదాద్రి భువనగిరి, మహా:** అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి సమానత్వం, న్యాయం, ధర్మం వంటి విలువలను ప్రచారం చేసిన మహనీయుడు మహాత్మా శ్రీ బసవేశ్వరుడని ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాహితీ ,గౌడ కమ్యూనిటీ సభ్యులు, ఇతర కుల సంఘాల నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ పేరిట వల

- బ్లాక్ మెయిలింగ్‌తో నిలువు దోపిడీ
- 20 మందికి పైగా మైనర్లను మోసగించిన కీచకుడి అరెస్ట్
- సోషల్ మీడియాలో పరిచయం.. రహస్యంగా ఫొటోలు తీసి బెదిరింపులు
- కోటీశ్వరుల బిడ్డలే లక్ష్యంగా యువకుడి ఉచ్చు



**హైదరాబాద్, మహా :** సామాజిక మాధ్యమాలను ఆసరాగా చేసుకుని, అబద్ధపు ప్రేమను ఎరగా వేసి సంపన్న కుటుంబాలకు చెందిన మైనర్ బాలికల జీవితాలతో చెలగాటమాడుతున్న ఒక కరుడుగట్టిన మోసగాడి బాగోతం వెలుగులోకి వచ్చింది. అమాయకపు బాలికలను లోబరుచుకుని, వారి ఏకాంత చిత్రాలను రహస్యంగా బంధించి, ఆపై బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతూ లక్షల రూపాయలు దండుకుంటున్న కేటుగాడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత రెండేళ్ల వ్యవధిలోనే తెలుగు రాష్ట్రాల్లో సుమారు ఇరవై మందికి పైగా బాలికలు ఇతడి ఉచ్చులో పడి సర్వస్వం కోల్పోవడం సంచలనం సృష్టిస్తోంది. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం చామల్లమూడి గ్రామానికి చెందిన కోడూరి చంద్రశేఖర్ ఆజాద్ అలియాస్ అర్జున్ (23) ప్రస్తుతం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో నివాసముంటూ ఈ అఘాయిత్యాలకు పాల్పడుతున్నాడు. ఆజాద్ నేర శైలి అత్యంత పక్కాగా, పథకం ప్రకారం సాగేది. హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని బడా బాబులు, సంపన్నుల ఇళ్ల వద్ద పనిచేసే వాచ్‌మెన్లు, తోటమాలి వంటి సిబ్బందితో ముందుగా మాటకలిపి పరిచయం పెంచుకునేవాడు. వారి ద్వారా ఆయా ఇళ్లల్లో ఉండే యువతులు, బాలికల వివరాలను, వారి జీవనశైలిని ఆరా తీసేవాడు. మరోవైపు ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ధనిక కుటుంబాలకు చెందిన అమ్మాయిల ప్రొఫైల్స్ వెతికి పట్టుకునేవాడు. తాను కూడా కోటీశ్వరుడినే అని నమ్మించేందుకు, ఖరీదైన కార్లు, పబ్‌లలో తాను దిగిన ఫొటోలను వారికి పంపుతూ, మాయమాటలతో చాటింగ్ చేసి దగ్గరయ్యేవాడు. అతడి ఆడంబరాలు చూసి నిజమైన ప్రేమే అని నమ్మి వచ్చిన యువతులను వ్యూహాత్మకంగా లోబరుచుకునేవాడు. వారితో గడిపిన క్షణాలను అత్యంత రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీసి తన వద్ద పదిలపరుచుకునేవాడు. ఒకసారి ఆ దృశ్యాలు అతడి చేతికి చిక్కాక తన అసలు స్వరూపం బయటపెట్టేవాడు. ఆ ఏకాంత ఫొటోలు, వీడియోలను బాధిత బాలికలకు చూపించి, తాను అడిగినంత డబ్బు ఇవ్వకపోతే వాటిని ఇంటర్నెట్‌లో పెడతానని, తల్లిదండ్రులకు చూపిస్తానని తీవ్రస్థాయిలో బెదిరింపులకు దిగేవాడు. పరువు పోతుందన్న భయంతో, తల్లిదండ్రులకు ఈ విషయం తెలిస్తే ఏమవుతుందో అన్న ఆందోళనతో కంగుతిన్న బాలికలు.. గత్యంతరం లేక తమ సొంత ఇళ్లల్లోనే దొంగతనాలకు ఒడిగట్టేవారు. ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలను దొంగిలించి తీసుకువచ్చి ఆజాద్ చేతిలో పెట్టేవారు. ఆ భయంతోనే ఎంతో మంది యువతులు అతడి అడిగినంత సమర్పించుకున్నారు. తాజాగా జూబ్లీహిల్స్‌లోని ఓ సంపన్న కుటుంబానికి చెందిన పదిహేనేళ్ల మైనర్ బాలిక వ్యవహారంతో ఆజాద్ ఆగడాలకు బ్రేక్ పడింది. అర్జున్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకున్న ఆజాద్, రాత్రి వేళల్లో రహస్యంగా ఆమె ఇంటికి వెళ్లి కలిసేవాడు. దీనిని పసిగట్టిన బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, గతంలో అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపారు. అయితే జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ఆజాద్ తన వక్రబుద్ధిని మార్చుకోలేదు. సదరు బాలిక వాళ్ల ఇంటి డ్రైవర్ కృష్ణ, అతడి భార్య సరస్వతి మొబైల్ ఫోన్ల ద్వారా ఆమెతో తిరిగి సంప్రదింపులు జరిపాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆజాద్ ఆమెను కలిసి ఏకాంతంగా గడిపాడు. ఇదే అదనుగా భావించిన డ్రైవర్ భార్య సరస్వతి, ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెబుతానంటూ ఆ బాలికను బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించింది. మరోవైపు ఆజాద్ సైతం తనదైన శైలిలో బెదిరింపులకు దిగాడు. ఇద్దరి బెదిరింపులు తాళలేక తీవ్ర భయాందోళనలకు గురైన ఆ బాలిక.. ఇంట్లో దాచిపెట్టిన ఏకంగా ఇరవై తొమ్మిది లక్షల రూపాయల నగదును దొంగిలించింది. అందులో ఆజాద్‌కు పదమూడు లక్షలు, సరస్వతికి పది లక్షల రూపాయలు ముట్టజెప్పింది. ఇంట్లో భారీగా నగదు మాయం కావడంతో కుటుంబ సభ్యులు ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆదివారం ఆజాద్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. నార్సింగి ప్రాంతానికి చెందిన మరో యువతిని కూడా ఇతడు ఇదే తరహాలో వంచించినట్లు తేలింది. గుంటూరులో కళాశాలలో చేరేందుకు వెళ్లిన ఆ యువతిని మాయ మాటలు చెప్పి హోటల్ గదికి తీసుకెళ్లి శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఆ తర్వాత గుంటూరు, హైదరాబాద్‌లలో పలు పబ్‌లు, హోటళ్లకు తిప్పి, ఆ ఫొటోలు, వీడియోలు చూపించి ఆమె మెడలోని బంగారు గొలుసును సైతం కాజేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడు. ఈ ఘరానా మోసగాడి అరెస్ట్‌తో ఇన్నాళ్లూ గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పాడుపని బట్టబయలైంది. ఈ ఉదంతంపై కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.


## మొక్కజొన్న రైతన్నకు మహా ఊరట

**మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో యాసంగి మొక్కజొన్న దిగుబడులు భారీగా మార్కెట్లకు పోటెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. రైతన్నలు ఎంతో శ్రమించి పండించిన ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చిన ఆయన, అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టారు. వ్యవసాయ మార్కెట్లకు, కొనుగోలు కేంద్రాలకు వస్తున్న మొక్కజొన్న పంట రద్దీని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆయన కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రెండు వందల కొనుగోలు కేంద్రాల ద్వారా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు చురుగ్గా సాగుతున్నాయి. అయితే, దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఒక్కసారిగా భారీ ఎత్తున తమ పంటను విక్రయించేందుకు కేంద్రాలకు బారులు తీరుతున్నారు. ఫలితంగా పలుచోట్ల తీవ్ర రద్దీ నెలకొంటోంది. దీనిని నివారించడానికి, రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులు కాయకుండా ఉండేందుకు వీలుగా ఎక్కడికక్కడ అదనంగా కొత్త కేంద్రాలను ప్రారంభించాలని మంత్రి తుమ్మల అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రైతుల సౌకర్యార్థం అవసరమైన చోటల్లా తక్షణమే కొనుగోలు కేంద్రాలను విస్తరించడం ద్వారా ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆయన సూచించారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను ఎప్పటికప్పుడు సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన పంటను ఏమాత్రం ఆలస్యం చేయకుండా అప్పటికప్పుడే గోదాములకు తరలించాలని మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులను ఆయన గట్టిగా ఆదేశించారు. రానున్న రోజుల్లో అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్నందున, ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంట వానపాలు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన వెంటనే తగిన రవాణా సదుపాయాలను ఏర్పాటు చేసుకుని, పంటను సురక్షితంగా గోదాములకు చేర్చాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని, కొనుగోలు ప్రక్రియలో కింది స్థాయిలో కూడా ఎక్కడా జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.

# గల్ఫ్‌లో హైటెన్షన్

- భారతీయ చమురు నౌకలకు నేవీ హైఅలర్ట్
- లారక్ దీవికి దూరంగా ఉండాలని నౌకాదళం స్పష్టమైన ఆదేశాలు
- రంగంలోకి ఏడు భారీ యుద్ధ నౌకలు



**ఢిల్లీ, మహా:** పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు భగ్గుమంటున్న వేళ భారత నౌకాదళం అత్యంత అప్రమత్తమైంది. ఆ మార్గంలో చమురు రవాణా చేసే భారతీయ వాణిజ్య నౌకలకు భద్రతా కారణాల దృష్ట్యా కీలకమైన అడ్వైజరీని జారీ చేసింది. ఇరాన్ దళాల ఆధీనంలో ఉండే లారక్ ద్వీపం పరిసర ప్రాంతాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలని, నౌకాదళం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించాలని అందులో తేల్చిచెప్పింది. ఏప్రిల్ పద్దెనిమిదో తేదీన ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) బలగాలు రెండు భారతీయ నౌకలను లక్ష్యంగా చేసుకుని కాల్పులకు తెగబడిన నేపథ్యంలో, అప్రమత్తమైన భారత రక్షణ శాఖ హర్మూజ్ జలసంధి వద్ద భద్రతను మునుపెన్నడూ లేని విధంగా కట్టుదిట్టం చేసింది. జలసంధిని దాటేందుకు వేచి ఉన్న ప్రతి భారతీయ నౌక భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని నేవీ స్పష్టం చేసింది.

**ఇరాన్ రాయబారికి తీవ్ర నిరసన..**

ఇప్పటి వరకు పర్షియన్ గల్ఫ్ నుంచి పదకొండు భారతీయ నౌకలు అత్యంత సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయి. ఏప్రిల్ పద్దెనిమిదో తేదీన 'దేశ్ గరిమ' అనే చమురు ట్యాంకర్ చివరగా ఈ జలసంధిని దాటింది. అయితే అదే రోజున 'జగ్ అర్నవ్', 'సన్మార్ హెరాల్డ్' అనే మరో రెండు భారతీయ నౌకలు జలసంధిని దాటేందుకు ప్రయత్నించగా, ఇరాన్ దళాలు ఒక్కసారిగా కాల్పులు జరపడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకునేందుకు అవి వెనక్కి మళ్లాల్సి వచ్చింది. భారత నౌకలపై జరిగిన ఈ దాడిని కేంద్ర విదేశాంగ శాఖ అత్యంత తీవ్రంగా పరిగణించింది. తక్షణమే భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీకి సమన్లు జారీ చేసి, ఈ ఘటనపై తమ తీవ్ర నిరసనను తెలియజేసింది. కాగా, కాల్పుల నడుమ హర్మూజ్ జలసంధిని దాటిన 'దేశ్ గరిమ' నౌకకు అరేబియా సముద్రంలో భారత నౌకాదళం పటిష్టమైన ఎస్కార్ట్ (రక్షణ) కల్పిస్తూ తీసుకువస్తోంది. ఇది ఏప్రిల్ ఇరవై రెండు నాటికి సురక్షితంగా ముంబయి తీరానికి చేరుకుంటుందని అధికారులు భావిస్తున్నారు.

**లారక్ దీవి చుట్టూ పొంచి ఉన్న ముప్పు..**

హర్మూజ్ జలసంధిలోని అత్యంత ఇరుకైన ప్రాంతంలో కొలువై ఉన్న లారక్ ద్వీపం ప్రస్తుతం అగ్నిగుండాన్ని తలపిస్తోంది. ఇరాన్ చమురు మౌలిక సదుపాయాలకు ప్రధాన కేంద్రమైన ఈ ప్రాంతంలో ఆ దేశం అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. భారీ బంకర్లు, అత్యాధునిక రాడార్ వ్యవస్థల ద్వారా హర్మూజ్ గుండా వెళ్లే ప్రతి నౌక రాకపోకలను ఇరాన్ నిరంతరం పర్యవేక్షిస్తోంది. కేవలం ముప్పై మూడు కిలోమీటర్ల వెడల్పు ఉండే హర్మూజ్ జలసంధిలో హర్మూజ్ ద్వీపం ఉండగా, దానికి దక్షిణంగా ఈ లారక్ ద్వీపం ఉంటుంది. ప్రపంచ చమురులో సుమారు ఇరవై శాతం రవాణా ఈ కీలక మార్గం గుండానే జరుగుతుంది. అయితే, ఈ ప్రాంతంలో ఇరాన్ అనేక సైనిక స్థావరాలను ఏర్పాటు చేసిందని, చిన్నపాటి వేగవంతమైన పడవల ద్వారా ఎంతటి భారీ నౌకలపైనైనా క్షణాల్లో దాడులు చేయగల సామర్థ్యం వారికి ఉందని నిఘా వర్గాల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**సముద్ర గర్భంలో మైన్స్.. పటిష్ట కాపలాలో నేవీ..**

గతంలో ఒమన్ తీరానికి సమీపంలో ఉన్న దక్షిణ మార్గాన్ని వాణిజ్య నౌకలు సురక్షితంగా భావించేవి. కానీ, తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ మార్గంలో ఇరాన్ దళాలు సముద్ర గర్భంలో నౌకలను పేల్చేసే భారీ బాంబులను (మైన్స్) అమర్చిందనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఆ మార్గాన్ని అత్యంత ప్రమాదకరమైన జలమార్గంగా ప్రకటించారు. ప్రస్తుతం హర్మూజ్, లారక్ ద్వీపాల మధ్య ఉన్న సన్నటి మార్గాన్ని మాత్రమే సురక్షిత కారిడార్‌గా పరిగణిస్తున్నారు. అందుకే లారక్ ద్వీపం సమీపానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని భారత నౌకలకు ఇండియన్ నేవీ కఠిన సూచనలు చేసింది. ప్రస్తుతం పద్నాలుగు భారతీయ నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోని జలసంధిని దాటేందుకు నిరీక్షిస్తున్నాయి. ఈ నౌకల భద్రత కోసం భారత నౌకాదళం ఏకంగా ఏడు భారీ యుద్ధ నౌకలను పర్షియన్ గల్ఫ్ పరిసరాల్లో మోహరించింది. మరోవైపు, దేశీయ చమురు అవసరాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. రష్యా నుంచి చమురు దిగుమతులను సురక్షితంగా కొనసాగించేందుకు వీలుగా.. పదకొండు రష్యా బీమా సంస్థలకు ప్రభుత్వం అత్యవసర అనుమతులు మంజూరు చేసింది.

# విజయ్ విడాకుల కేసులో కీలక మలుపు

- జూన్ 15న కోర్టుకు రాక తప్పదన్న న్యాయస్థానం
- చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విచారణ వాయిదా
- వీడియో కాన్ఫరెన్స్ కు నో చెప్పిన జడ్జి



**చెన్నై, మహా:** కోలీవుడ్ అగ్రకథానాయకుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ వ్యక్తిగత జీవితం ఇప్పుడు న్యాయస్థానం మెట్లు ఎక్కి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన సతీమణి సంగీత దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌పై చెంగల్పట్టు ఫ్యామిలీ వెల్ఫేర్ కోర్టులో సోమవారం కీలక విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించి ఇరువురు తప్పనిసరిగా జూన్ 15న కోర్టులో వ్యక్తిగతంగా హాజరుకావాలని న్యాయమూర్తి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేశారు.

**వీడియో కాన్ఫరెన్స్ కు ససేమిరా..**

తొలుత చెంగల్పట్టు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో నమోదైన ఈ కేసు, అనంతరం ఫ్యామిలీ వెల్ఫేర్ కోర్టుకు బదిలీ అయిన విషయం విదితమే. ఫిబ్రవరి 26న జరిగిన తొలి విచారణలో న్యాయస్థానం ఇరువురికీ సమన్లు జారీ చేయగా, తదుపరి విచారణను ఏప్రిల్ 20వ తేదీకి వాయిదా వేసింది. అయితే, సోమవారం నాటి విచారణకు విజయ్, సంగీత ఇద్దరూ విముఖత చూపుతూ వ్యక్తిగతంగా హాజరుకాలేదు. కేవలం వారి తరఫు న్యాయవాదులు మాత్రమే కోర్టుకు వచ్చారు. ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో విజయ్ అత్యంత బిజీగా ఉన్నారని, అందువల్ల ఆయనకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యే వెసులుబాటు కల్పించాలని ఆయన న్యాయవాది న్యాయమూర్తిని కోరారు. కానీ, ఈ విజ్ఞప్తిని సున్నితంగా తిరస్కరించిన కోర్టు.. తదుపరి విచారణకు వ్యక్తిగత హాజరే తప్పనిసరని తేల్చిచెప్పింది.

**నాలుగేళ్లుగా ఒకే ఇంట్లో.. కానీ దూరంగా!**


తన భర్త విజయ్ నుంచి విడాకులు కావాలంటూ సంగీత గత ఫిబ్రవరి 24న కోర్టును ఆశ్రయించారు. 1999లో ఘనంగా జరిగిన తమ వివాహ బంధంలో ఇద్దరు పిల్లలు (ఒక కుమారుడు, ఒక కుమార్తె) ఉన్నారని ఆమె తన పిటిషన్‌లో ప్రస్తావించారు. పెళ్లయిన తొలినాళ్లలో అంతా సవ్యంగానే సాగినప్పటికీ, 2021 నుంచి తమ మధ్య పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, దీనివల్ల తాను తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యానని ఆమె న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. గత నాలుగేళ్లుగా ఇద్దరం ఒకే ఇంట్లో ఉంటున్నప్పటికీ, వాస్తవానికి ఒకరికొకరం విడిగానే జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు సోషల్ మీడియాలో వస్తున్న వివిధ పోస్టులు తనకు, తన పిల్లలకు తీరని అవమానాన్ని మిగుల్చుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో తమ వివాహ బంధాన్ని చట్టబద్ధంగా రద్దు చేసి విడాకులు మంజూరు చేయాలని, లేదా శాశ్వత భరణం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆమె కోరారు. అలాగే, ఈ వ్యవహారం సున్నితమైనది కావడంతో, విచారణను ఇన్‌కెమెరా విధానంలో రహస్యంగా జరపాలని సంగీత కోర్టును అభ్యర్థించారు.

**భరణంపై జోరుగా ఊహాగానాలు..**

విడాకుల వ్యవహారం తెరపైకి రావడంతో, కోలీవుడ్ వర్గాల్లో సెటిల్‌మెంట్ అంశంపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. విజయ్ కున్న వందల కోట్ల ఆస్తుల నేపథ్యంలో, సంగీత సుమారు రూ. 250 కోట్ల వరకు భరణం (సెటిల్‌మెంట్) డిమాండ్ చేసినట్లు పలు మీడియా కథనాలు కోడై కూస్తున్నాయి. మరోవైపు, విజయ్ మాత్రం రూ. 35 కోట్ల వరకు భరణం ఇచ్చేందుకు మొగ్గుచూపుతున్నారని, అలాగే పిల్లల బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని స్పష్టం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ భారీ సెటిల్‌మెంట్ వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ వెలువడలేదు.ఇదిలా ఉండగా, ఇప్పటివరకు సంగీత మాత్రమే విడాకుల పిటిషన్ దాఖలు చేశారని, విజయ్ తరఫున ఎలాంటి కౌంటర్ పిటిషన్ నమోదు కాలేదని న్యాయవాదులు స్పష్టం చేశారు. రానున్న జూన్ 15వ తేదీన జరిగే విచారణలో విజయ్ తన వాదనలను బలంగా వినిపించే అవకాశం ఉంది. అటు సినీ రంగంలో, ఇటు రాజకీయాల్లో అత్యంత చురుకైన పాత్ర పోషిస్తున్న విజయ్‌కు ఈ కేసు విచారణ అత్యంత కీలకంగా మారనుంది. ఇద్దరూ కోర్టు బోనులో నిలబడి తమ వాదనలు వినిపించనున్న నేపథ్యంలో, జూన్ 15 నాటి విచారణ ఈ కేసులో కీలక మలుపు అవుతుందని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# జపాన్‌ను వణికించిన భారీ భూకంపం

- సముద్ర గర్భంలో మహా ప్రళయం..
- పొంచి ఉన్న సునామీ ముప్పు.



**టోక్యో,మహా:** సూర్యుడు అస్తమిస్తున్న వేళ జపాన్ దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రశాంతంగా ఉన్న పసిఫిక్ సముద్ర గర్భంలో సోమవారం సాయంత్రం మహా ప్రళయం బద్దలైంది. ఉత్తర ఇవాటే ప్రిఫెక్చర్ సమీపంలో సముద్ర గర్భంలో పది కిలోమీటర్ల లోతున సంభవించిన అత్యంత శక్తివంతమైన భూకంపం జపాన్ తీరాన్ని తీవ్రంగా వణికించింది. జపాన్ వాతావరణ సంస్థ ప్రాథమికంగా దీని తీవ్రతను రిక్టర్ స్కేలుపై 7.4గా అంచనా వేయగా, అది 7.5గా ఉండొచ్చని తర్వాత సవరించింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం నాలుగు గంటల యాభై మూడు నిమిషాలకు భూమి అమాంతం కంపించడంతో ప్రజలు ప్రాణభయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజధాని టోక్యో నగరంలో సైతం ఆకాశహర్మ్యాలు పెద్దఎత్తున ఊగిపోవడం ఈ భూకంప తీవ్రతకు అద్దం పడుతోంది.ఈ మహా భూకంపం వెనువెంటనే జపాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. సముద్రపు అలలు పది అడుగుల (మూడు మీటర్ల) మేర ఉవ్వెత్తున ఎగసిపడే ప్రమాదం పొంచి ఉండటంతో ఇవాటే, ఆమోరి, హొక్కైడో ప్రాంతాలకు అధికారులు రెడ్ అలెర్ట్ ప్రకటించి, అత్యవసర సునామీ హెచ్చరికలు జారీ చేశారు. టెలివిజన్ తెరల నిండా 'తక్షణమే ప్రాణాలు కాపాడుకోండి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోండి' అనే సందేశాలు నిరంతరాయంగా ప్రసారం అవుతున్నాయి. తీరప్రాంతాలు, నదీ తీరాల వెంబడి నివసిస్తున్న లక్షలాది మంది ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఎత్తైన కొండలు, పటిష్టమైన భవనాలపైకి చేరుకోవాలని యంత్రాంగం కఠిన ఆదేశాలు జారీ చేసింది. సునామీ అలలు ఒకదాని తర్వాత ఒకటి విరుచుకుపడే అవకాశం ఉన్నందున, హెచ్చరికలు అధికారికంగా ఉపసంహరించే వరకూ ఎవరూ కిందకు రావొద్దని విపత్తు నిర్వహణ సంస్థలు హెచ్చరిస్తున్నాయి.ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థలను తాత్కాలికంగా నిలిపివేశారు. ముఖ్యంగా టోక్యో, ఆమోరి నగరాల మధ్య రాకపోకలు సాగించే అత్యంత వేగవంతమైన బుల్లెట్ రైలు (షింకన్‌సెన్) సర్వీసులకు ఎక్కడికక్కడ బ్రేకులు వేశారు. మరోవైపు, తీరంలో లంగరు వేసిన నౌకలు సునామీ అలల తాకిడికి ధ్వంసం కాకుండా ఉండేందుకు హచినోహే తదితర కీలక ఓడరేవుల నుంచి నడిసముద్రం లోపలికి తరలిస్తున్నారు. విపత్తు తీవ్రతను అంచనా వేసిన జపాన్ ప్రధానమంత్రి సనే తకైచి హుటాహుటిన ఒక అత్యవసర టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దించారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్న ప్రధాని, ప్రాణనష్టం జరగకుండా అన్ని యంత్రాంగాలను సమన్వయం చేస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల నేపథ్యంలో జపాన్ ప్రజలు తీవ్ర భయాందోళనల నడుమ క్షణాలు గడుపుతున్నారు.

# ప్రధాని పర్యటనకు ముందే అపశ్రుతి

- హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం
- కలకలం రేపుతున్న ఘటన.. భద్రతా లోపమా?
- సాంకేతిక సమస్యా? అనే కోణంలో దర్యాప్తు



**పచ్‌పద్ర (రాజస్థాన్),మహా:** రాజస్థాన్‌లోని పచ్‌పద్రలో ఉన్న ప్రతిష్ఠాత్మక హెచ్‌పీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీలో సోమవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దాదాపు రూ.79,450 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన ఈ మెగా ప్రాజెక్టును మంగళవారం (ఏప్రిల్ 21న) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయాల్సి ఉంది. ప్రధాని పర్యటనకు సరిగ్గా ఒకరోజు ముందు ఈ అనూహ్య ఘటన చోటుచేసుకోవడం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది.రిఫైనరీలోని ప్రధాన యూనిట్లలో ఒకదానిలో సోమవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే అవి భారీ స్థాయికి చేరుకుని, దట్టమైన నల్లటి పొగ ఆకాశాన్ని కమ్మేసింది. ప్రమాదాన్ని పసిగట్టిన వెంటనే అప్రమత్తమైన అధికారులు ప్లాంట్‌లోని కార్మికులను అత్యవసర మార్గాల ద్వారా సురక్షితంగా బయటకు తరలించారు. దీనివల్ల పెను ప్రాణనష్టం తప్పినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే దాదాపు 20కి పైగా అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నాయి. మంటలు పక్కనే ఉన్న ఇతర యూనిట్లకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదంలో భారీ యంత్రసామగ్రి కాలిపోవడం వల్ల కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో అప్పటికే ఉన్నతాధికారులు, స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ బలగాలు అక్కడ పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత, నిఘా నీడలో అగ్నిప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. ఇది కేవలం సాంకేతిక లోపం వల్ల జరిగిందా, లేక ఏదైనా భద్రతా వైఫల్యం ఉందా అనే కోణంలో ఉన్నతాధికారులు అత్యవసర దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైన తరుణంలో జరిగిన ఈ ఘటన అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. కాగా, ఈ అగ్నిప్రమాదం నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన ప్రధాని మోదీ పర్యటన, ప్రారంభోత్సవ షెడ్యూల్‌లో ఏవైనా మార్పులు ఉంటాయా, లేదా కార్యక్రమం వాయిదా పడుతుందా అనే విషయాలపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఉన్నత విద్యావంతులూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవడమా..?

- డిజిటల్ అరెస్ట్'ల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్ర దిగ్భ్రాంతి
- వయోవృద్ధురాలి దీనస్థితిని ప్రస్తావించి ఆవేదన వ్యక్తం చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- డిజిటల్ అరెస్టుల కేసుపై మే 12న సుమోటో విచారణ

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా కలకలం రేపుతూ అమాయకుల ప్రాణాలతో, ఆస్తులతో చెలగాటమాడుతున్న 'డిజిటల్ అరెస్ట్'ల వ్యవహారంపై భారత సర్వోన్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో స్పందించింది. ఉన్నత చదువులు చదివిన విద్యావంతులు సైతం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని నకిలీ బెదిరింపులకు భయపడి మోసపోతుండటం పట్ల ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. సమాజంలో చదువురాని సామాన్యులే కాకుండా, చట్టాలపై , సాంకేతికతపై కనీస అవగాహన ఉండాల్సిన విద్యావంతులు కూడా ఈ తరహా కొత్త తరహా మోసాలకు సులువుగా బలికావడం అత్యంత బాధాకరమని, ఇది వ్యవస్థల లోపాన్ని అలాగే సైబర్ నేరగాళ్ల పకడ్బందీ వ్యూహాలను సూచిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన తనకు తెలిసిన ఒక హృదయ విదారకమైన ఘటనను న్యాయస్థానం వేదికగా ప్రస్తావించారు. తనకు పరిచయం ఉన్న ఒక వయోవృద్ధురాలిని ఇటీవల సైబర్ కేటుగాళ్లు అత్యంత చాకచక్యంగా బురిడీ కొట్టించారని జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు. తాము సీబీఐ, పోలీసు అధికారులమంటూ నమ్మబలికి, వీడియో కాల్స్ ద్వారా ఆమెను వర్చువల్ విధానంలో 'డిజిటల్ అరెస్ట్' చేశామని భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. ఆ వయసులో ఎటూ తేల్చుకోలేక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన ఆ వృద్ధురాలు, కటకటాల పాలు కావాల్సి వస్తుందన్న భయంతో తన జీవితకాల కష్టార్జితమైన రిటైర్మెంట్ సొమ్ము మొత్తాన్ని నేరగాళ్ల ఖాతాలకు బదిలీ చేసి సర్వస్వం కోల్పోయారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి హేయమైన చర్యల వల్ల ఎంతోమంది వృద్ధులు, సామాన్యులు తమ జీవితకాల పొదుపును క్షణాల్లో కోల్పోతున్నారని ఆయన గుర్తుచేశారు.దేశంలో రోజురోజుకూ పేట్రేగిపోతున్న ఈ డిజిటల్ అరెస్టుల మహమ్మారి కట్టడికి సుప్రీంకోర్టు నడుంబిగించింది. సామాజిక మాధ్యమాలు, కమ్యూనికేషన్ టెక్నాలజీని ఆసరాగా చేసుకుని జరుగుతున్న ఈ సైబర్ మోసాలపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ కేసును అత్యంత తీవ్రమైనదిగా పరిగణించి, మే 12వ తేదీన ఈ అంశంపై సుదీర్ఘమైన, సమగ్రమైన విచారణ చేపట్టనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలను, దర్యాప్తు సంస్థలను మరింత అప్రమత్తం చేసి, ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ కల్పించే దిశగా ఆ రోజున అత్యున్నత న్యాయస్థానం కీలక మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

## మంత్రాలు లేవు.. తంత్రాలు లేవు
# అదంతా వట్టి భ్రమే..

- ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లో 'నిమ్మకాయ' కుర్రాడి అసలు కథ
- నెట్టింట వైరలైన నిమ్మకాయ వీడియో వెనుక అసలు నిజం విప్పిన 'సన్నీ'

**హైదరాబాద్, మహా:** క్రికెట్ మైదానంలో ఆటగాళ్ల ప్రతిభతో పాటు అప్పుడప్పుడు గ్యాలరీలో జరిగే కొన్ని విచిత్రమైన ఘటనలు కూడా అనూహ్యంగా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుంటాయి. తాజాగా ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఏప్రిల్ 18వ తేదీన ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరిగిన అత్యంత ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో సరిగ్గా అలాంటి అరుదైన, ఆసక్తికరమైన ఘటనే ఒకటి చోటుచేసుకుంది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో గ్యాలరీలో కూర్చున్న సన్నీ అనే ఒక యువకుడు, తన చేతిలో నిమ్మకాయను పట్టుకుని కళ్లు మూసుకుని తీవ్రంగా ఏదో మంత్రాలు చదువుతున్నట్లుగా ఉన్న ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో దావానలంలా వ్యాపించింది. విచిత్రం ఏమిటంటే, అతడు అలా నిమ్మకాయను చేతబూని మంత్రాలు చదువుతున్నట్లుగా నటించిన సరిగ్గా అదే సమయానికి క్రీజులో ఉన్న చెన్నై జట్టు పవర్‌హిట్టర్ శివం దుబే వికెట్ కోల్పోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. దీనితో స్టేడియంలో సన్‌రైజర్స్ అభిమానులు ప్రత్యర్థి జట్టు వికెట్లు పడగొట్టేందుకు క్షుద్ర పూజలు (బ్లాక్ మ్యాజిక్) చేస్తున్నారంటూ జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున వార్తలు వెల్లువెత్తాయి. లక్షలాది వీక్షణలు సొంతం చేసుకున్న ఈ వీడియో క్రికెట్ వర్గాల్లో పెను సంచలనంగా మారి, ఎన్నో ఊహాగానాలకు తావిచ్చింది. ఈ నిమ్మకాయ వ్యవహారం అంతకంతకూ ముదురుతున్న తరుణంలోనే ఇంటర్నెట్‌లో ఒక నకిలీ లేఖ ప్రత్యక్షమై ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. స్టేడియంలో జరిగిన ఈ 'బ్లాక్ మ్యాజిక్' వ్యవహారంపై చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ భారత క్రికెట్ నియంత్రణ మండలికి (బీసీసీఐ) అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే, దీనిపై లోతైన విచారణ జరపగా అదంతా ఒక బూటకమని తేలింది. ఆ వైరల్ లేఖలో కనీసం చెన్నై జట్టు అధికారిక పేరును కూడా దుండగులు తప్పుగా ముద్రించారు. తమకు ఆ ఫ్రాంచైజీ నుంచి అటువంటి ఫిర్యాదు ఏదీ అసలు అందలేదని బీసీసీఐ వర్గాలు సైతం అధికారికంగా ధృవీకరించాయి. కేవలం సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లను తప్పుదోవ పట్టించి, అనవసరమైన వివాదాన్ని సృష్టించడానికే ఎవరో ఆకతాయిలు ఈ నకిలీ లేఖను సృష్టించినట్లు స్పష్టమైంది.ఊహాగానాలకు, వదంతులకు చెక్ పెడుతూ ఎట్టకేలకు ఆ వైరల్ వీడియోలో ఉన్న యువకుడు 'సన్నీ' స్వయంగా మీడియా ముందుకు వచ్చి అసలు నిజాన్ని బట్టబయలు చేశాడు. అసలు తనకు ఎలాంటి మంత్ర తంత్రాలు రావని, క్షుద్ర పూజలు చేశాననడం అవాస్తవమని అతను కొట్టిపారేశాడు. ఆ రోజు స్టేడియంలో విపరీతమైన రద్దీ, ఉక్కపోత ఉండటంతో తనకు వాంతులు అయ్యేలా అనిపించిందని, ఆ సమయంలో ఉపశమనం కోసం మాత్రమే ఒక నిమ్మకాయను తన వెంట తీసుకెళ్లానని వివరించాడు. తన అనారోగ్య పరిస్థితిని చూసి పోలీసులే స్వయంగా ఆ నిమ్మకాయను లోపలికి తీసుకెళ్లేందుకు అనుమతించారని తెలిపాడు. గ్యాలరీలో ఉత్సాహంగా మ్యాచ్ చూస్తున్న సమయంలో, కేవలం సరదా కోసం, సోషల్ మీడియాలో ఒక మంచి వీడియోను పోస్ట్ చేయాలనే ఉద్దేశంతో మాత్రమే తాను అలా మంత్రాలు చదువుతున్నట్లు నటించానని సన్నీ స్పష్టం చేశాడు.

## తూర్పుగోదావరి జిల్లాలో
# భారీ అగ్నిప్రమాదం

- రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌లో భయానక పేలుడు
- అయ్యపంగిడిలో ఉలిక్కిపడ్డ జనం
- తీవ్ర వత్తిడితో గ్యాస్ పైప్‌లైన్ పగిలి భారీ ప్రమాదం
- పెను ప్రాణనష్టం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న స్థానికులు
- రిలయన్స్ ప్లాంట్‌లో పేలుడుపై అధికారుల ముమ్మర దర్యాప్తు


**తూర్పుగోదావరి,మహా:** తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం అయ్యపంగిడిలో ఉన్న రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. అత్యంత భయానక శబ్దంతో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ఫ్యాక్టరీలో నుంచి భారీ ఎత్తున మంటలు, దట్టమైన నల్లటి పొగలు ఆకాశాన్ని కమ్మేశాయి. ఈ ఊహించని పరిణామంతో ఫ్యాక్టరీలోని కార్మికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రాణభయంతో తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇటీవలే కొత్తగా ప్రారంభించిన ఈ బయోగ్యాస్ ప్లాంట్‌లో పశువుల పేడ, ఇతర వ్యర్థాల ద్వారా ఉత్పత్తి చేసిన గ్యాస్‌ను పైప్‌లైన్ల ద్వారా స్టోరేజ్ ప్లాంట్‌కు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గ్యాస్ సరఫరా అవుతున్న సమయంలో పైప్‌లైన్‌లో ఒక్కసారిగా తీవ్రమైన వత్తిడి (ప్రెజర్) ఏర్పడటంతో, దానికి ఉన్న మూతలు పగిలిపోయి ఈ భారీ పేలుడు సంభవించినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీలో కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ, పేలుడు సంభవించిన పైప్‌లైన్ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది. కార్మికులంతా క్షేమంగా ఉన్నారని, ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని ఫ్యాక్టరీ వర్గాలు ప్రకటించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో స్థానికులు భయాందోళనకు గురికాకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తం చేశారు.ఈ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు సమయంలో భద్రతా పరంగా యాజమాన్యం అన్ని చర్యలు తీసుకున్నట్లు గతంలో ఫైర్ సేఫ్టీ అధికారులు నిర్ధారించినప్పటికీ, తాజా పేలుడు నేపథ్యంలో మరోసారి సమగ్ర విచారణ జరపాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత, అసలు ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, సాంకేతిక లోపాలపై లోతైన దర్యాప్తు చేపడతామని అగ్నిమాపక, భద్రతా అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు, ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా ఈ ఘటనపై విచారణకు సహకరించి పూర్తి స్థాయి నివేదికను అందించాల్సి ఉంది. ప్రస్తుతానికి మంటలను అదుపు చేసే ప్రక్రియ కొనసాగుతోందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికార యంత్రాంగం భరోసా ఇచ్చింది.

# బెల్జియం గడ్డపై రెపరెపలాడిన త్రివర్ణ పతాకం..

- 24 గంటల ఎండ్యూరెన్స్ రేసులో అజిత్ జట్టుకు అద్భుత విజయం
- సినిమాల్లోనే కాదు.. రేసింగ్ ట్రాక్‌పైనా 'తలా' అదరహో
- మోటార్ స్పోర్ట్స్ లో భారత కీర్తిపతాకను ఎగరేసిన స్టార్ హీరో అజిత్




**బెల్జియం,మహా:** వెండితెరపై అద్భుతమైన యాక్షన్ దృశ్యాలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించే కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్, తనకిష్టమైన మోటార్ స్పోర్ట్స్‌లోనూ సత్తా చాటుతూ అంతర్జాతీయ స్థాయిలో దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేస్తున్నారు. సినిమాలతో పాటు రేసింగ్ అంటే ప్రాణమిచ్చే ఈ యాక్షన్ హీరో, తాజాగా యూరప్ గడ్డపై అద్భుతమైన విజయాన్ని నమోదు చేసి భారతీయ మోటార్ స్పోర్ట్స్ అభిమానులను గర్వపడేలా చేశారు. బెల్జియంలోని అత్యంత ప్రఖ్యాతి గాంచిన సర్క్యూట్ డి స్పా-ఫ్రాంకోర్‌చాంప్స్ ట్రాక్‌పై జరిగిన 24 గంటల సిరీస్ రేసులో అజిత్ నేతృత్వంలోని రేసింగ్ టీమ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ప్రతిష్ఠాత్మకమైన రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సాగే ఎండ్యూరెన్స్ రేసులలో ఒకటైన ఈ పోటీలో, అంతర్జాతీయ స్థాయి జట్లను దీటుగా ఎదుర్కొని అజిత్ జట్టు ఈ అరుదైన ఘనతను సాధించడం ఇప్పుడు క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నిరంతరాయంగా 24 గంటల పాటు సాగే ఈ ఎండ్యూరెన్స్ రేసులో పాల్గొనాలంటే అపారమైన క్రీడా నైపుణ్యంతో పాటు, కళ్లు చెదిరే వేగం, ఏమాత్రం చెక్కుచెదరని ఏకాగ్రత, జట్టు సభ్యుల మధ్య అద్భుతమైన సమన్వయం ఎంతో అవసరం. ఇన్ని సవాళ్లను అధిగమిస్తూ, అనుభవజ్ఞులైన విదేశీ రేసర్లతో పోటీ పడి మరీ అజిత్ కుమార్ రేసింగ్ టీమ్ పోడియం ఫినిష్ చేయడం వారి శ్రమకు, పట్టుదలకు నిదర్శనమని విశ్లేషకులు కొనియాడుతున్నారు. ఈ అద్భుత విజయానంతరం పోడియంపైకి చేరుకున్న అజిత్ కుమార్.. సగర్వంగా భారత జాతీయ జెండాను చేతబూని ఎగురవేస్తూ చేసిన సంబరాలు ప్రతి భారతీయుడి గుండె ఉప్పొంగేలా చేశాయి. చేతిలో ట్రోఫీ, త్రివర్ణ పతాకంతో తన జట్టు సభ్యులతో కలిసి ఆయన ఉత్సాహంగా చేసుకున్న సెలబ్రేషన్స్ కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కేవలం ఒక నటుడిగా మాత్రమే కాకుండా, ఒక అంకితభావం గల క్రీడాకారుడిగా దేశ ప్రతిష్టను ఖండాంతరాలకు చాటిన ఆయనపై అటు సినీ, ఇటు క్రీడా అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇటీవల 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా షూటింగ్ అనంతరం, అజిత్ కుమార్ తన పూర్తి సమయాన్ని, దృష్టిని రేసింగ్‌పైనే కేంద్రీకరించారు. ఎవరి మీదా ఆధారపడకుండా ఏకంగా తన సొంత రేసింగ్ టీమ్‌ను ఏర్పాటు చేసుకున్న ఆయన, యూరప్ ఖండంలోని పలు దేశాల్లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక రేసింగ్ ఛాంపియన్‌షిప్‌లలో క్రమం తప్పకుండా పాల్గొంటున్నారు. ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ, యూకే, పోర్చుగల్ తదితర దేశాల్లో ఆయన రేసింగ్ షెడ్యూల్ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఇప్పటికే పలు యూరోపియన్ సిరీస్‌లలో తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించిన అజిత్ కుమార్ రేసింగ్ టీమ్, తాజా విజయంతో అంతర్జాతీయ మోటార్‌స్పోర్ట్స్‌లో తమకంటూ ఒక సుస్థిరమైన, ప్రముఖ స్థానాన్ని పదిలం చేసుకుంది. రాబోయే రోజుల్లో మోటార్ స్పోర్ట్స్ వేదికగా భారత్ కు మరిన్ని విజయాలు అందించే దిశగా అజిత్ బృందం అడుగులు వేస్తోంది.



మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 21-04-2026



ANN తెలుగు



## మరోసారి తల్లి కాబోతున్న దీపిక.. 'రాకా' కోసం కీలక నిర్ణయం!

బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె రెండోసారి తల్లి కాబోతున్న సంగతి తెలిసిందే. ఈ శుభవార్తని ఆదివారం అభిమానులతో పంచుకుంది దీపిక. దీంతో అందరూ రణ్‌వీర్, దీపిక దంపతులకు శుభాకాంక్షలు చెప్పారు. అదే సమయంలో ఆమె కొత్త సినిమాలపై రకరకాల పుకార్లను కూడా పుట్టించారు. దీపిక ఇక ఏ సినిమా షూటింగ్‌లో పాల్గొనదని.. పూర్తిగా రెస్ట్ తీసుకుంటుందనే వార్తలు వినిపించాయి. కానీ అందులో ఎలాంటి నిజం లేనట్లు తెలుస్తోంది. ఒప్పుకున్న సినిమాలను పూర్తి చేసిన తర్వాతే ఆమె విశ్రాంతి తీసుకోనున్నారట.

**రాకా కోసం యాక్షన్**

దీపికా ఒప్పుకున్న సినిమా రాకా ఒక్కటి. అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రమిది. సన్ పిక్చర్స్ ఏకంగా రూ.800 కోట్ల బడ్జెట్లో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇంకా సగం కూడా పూర్తికాలేదు. ఇందులో దీపికా పదుకొనే కీలక పాత్ర పోషిస్తుంది. ఆమె పాత్రకు యాక్షన్ సీన్స్ కూడా ఉన్నట్లు సమాచారం. గర్భం దాల్చినప్పటికీ.. యాక్షన్ సీన్స్ చేయడానికి దీపికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. నిపుణులైన వైద్య బృందం పర్యవేక్షణలో, అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ ఈ షూటింగ్ పూర్తి చేయాలని దీపిక నిర్ణయం తీసుకుందట. ఈ విషయం దర్శకుడు అట్లీకి కూడా చెప్పడంతో.. వీలైనంత తొందరగా దీపికకు సంబంధించిన సన్నివేశాల షూటింగ్‌ని పూర్తి చేయాలని ఆయన భావిస్తున్నాడట.

**'కింగ్'కోసం కూడా..**

దీపికా ఒప్పుకున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ 'కింగ్'. షారుఖ్ ఖాన్ హీరోగా నటిస్తున్న ఈ మూవీ షూటింగ్ కూడా ఇంకా పూర్తికాలేదు. ఇందులో కూడా దీపిక పదుకొణె పాత్రకు యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయట. వాటిని కూడా ఆమె ప్రెగ్నెంట్ గా ఉంటూనే పూర్తి చేయాల్సి ఉంది. తనవల్ల షూటింగ్‌కి అంతరాయం కావొద్దనే దీపికా ఈ నిర్ణయం తీసుకుందట. 'పఠాన్'లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత షారుక్‌ఖాన్ - సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.



## అనసూయపై అసభ్యకర కంటెంట్..

### మరో నిందితుడు అరెస్ట్

సామాజిక మాధ్యమాలలో టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్‌పై అసభ్యకర పోస్టులు పెడుతున్న నిందితుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనసూయ లక్ష్యంగా అసభ్యకరమైన సోషల్ మీడియా కంటెంట్ పోస్ట్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని దొరెపల్లి చంటి(30)గా సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. అతను చంటిదొరెపల్లి అనే పేరుతో సోషల్ మీడియా హ్యాండిల్ నిర్వహిస్తున్నారు. కాగా..ఇటీవలే జనార్ధన్ అనే నిందితుడిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు కడప జిల్లాకు చెందిన జనార్ధన్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది డిసెంబర్ 23న పలువురు సోషల్ మీడియాలో తనపై పరువు నష్టం కలిగించే విధంగా, అశ్లీల వ్యాఖ్యలను పోస్ట్ చేసి.. అభ్యంతరకరమైన కంటెంట్‌ను ప్రసారం చేశారంటూ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అనసూయ ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## విజయ్ దేవరకొండ క్రేజీ ప్రాజెక్ట్.. క్లాప్ కొట్టినా నేచురల్ స్టార్

రౌడీ విజయ్ దేవరకొండ హాయ్ నాన్న డైరెక్టర్ శౌర్యువ్‌తో జతకట్టారు. వీరిద్దరి కాంబోలో వస్తోన్న ఈ చిత్రం అఫీషియల్‌గా ప్రారంభమైంది. ఈ మూవీకి ముఖ్య అతిథిగా హాజరైన నేచురల్ స్టార్ నాని క్లాప్ కొట్టారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ప్రస్తుతానికి ఈ మూవీకి వీడీ శౌర్యువ్ అనే వర్కింగ్ టైటిల్ ఖరారు చేశారు. తొలిసారి వస్తోన్న ఈ కాంబోపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'హౌస్ ఆఫ్ ది డ్రాగన్' చిత్రానికి పనిచేసిన అలెజాండ్రో మార్టినెజ్ సినిమాటోగ్రఫీని అందిస్తుండటం మూవీపై అంచనాలు మరింత పెంచేసింది. ఈ మూవీకి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించనున్నారు. అయితే ఈ చిత్రంలో హీరోయిన్ ఎవరనే విషయాన్ని ఇంకా రివీల్ చేయలేదు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రస్తుతం విజయ్ దేవరకొండ రణబాలితో పాటు రౌడీ జనార్ధన అనే చిత్రాల్లో నటిస్తున్నారు.





## ప్రియుడి దర్శకత్వంలో సినిమా?

సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటుంది అగ్ర కథానాయిక శ్రద్ధాకపూర్. వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ పాత్రల పరంగా కొత్తదనానికి అధిక ప్రాధాన్యతనిస్తుంది. ప్రస్తుతం ఆమె మహారాష్ట్ర నృత్య కళాకారిణి విఠాబాయి బయోపిక్ 'ఈఠా'లో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ భామ హిందీలో మరో భారీ ప్రాజెక్ట్‌ను అంగీకరించింది. అమీర్‌ఖాన్ హీరోగా నటించే ఈ చిత్రాన్ని భారత్ పే మనీ రూపకర్త అశ్నీర్ గ్రోవర్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కించబోతున్నారు. విశేషమేమిటంటే.. శ్రద్ధాకపూర్ ప్రియుడిగా ప్రచారంలో ఉన్న ప్రముఖ దర్శకుడు, రచయిత రాహుల్ మోడీ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు నిర్మాణ బాధ్యతల్ని కూడా రాహుల్ మోడీ తీసుకున్నారు. శ్రద్ధాకపూర్ కథానాయికగా నటించిన 'తూ ఝూఠీ మే మక్కర్' చిత్రానికి రాహుల్ మోడీ రచయితగా పనిచేశారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో ఏర్పడిన పరిచయం క్రమంగా ప్రేమగా మారిందని తెలిసింది. గత రెండేళ్లుగా రాహుల్ మోడీతో శ్రద్ధాకపూర్ ప్రేమలో ఉందని బాలీవుడ్ టాక్. ప్రియుడి దర్శకత్వంలో సినిమా కావడంతో శ్రద్ధాకపూర్ ఈ సినిమాకు వెంటనే అంగీకరించిందని సమాచారం. త్వరలో ఈ చిత్రం సెట్స్ మీదకు వెళ్లనుంది.

## ఆ విషయంలో కఠినంగా ఉంటున్నా..

దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవడం, స్టార్‌డమ్ ఉండగానే నాలుగు డబ్బులు వెనకేసుకొని సెటిల్ అయిపోవడం హీరోయిన్లకు పరిపాటే. కానీ మృణాళ్‌ఠాకూర్ మాత్రం అందుకు భిన్నంగా ఆలోచిస్తున్నది. స్టార్ హీరో సినిమా అయినా సరే.. పారితోషికం భారీగా ముట్టజెబుతామన్నా సరే.. పాత్ర నచ్చకపోతే 'నో' చెప్పేస్తానని నిర్మొహమాటంగా చెప్పేసింది మృణాళ్‌ఠాకూర్. 'నటికి సంతృప్తి అవసరం. 'సీతారామం'లో సీతామహాలక్ష్మి పాత్ర, 'హాయ్ నాన్న'లో యష్ణ పాత్ర నా కెరీర్‌కి ఓ గౌరవాన్ని కట్టబెట్టాయి. ఏమాత్రం ప్రాధాన్యత లేని కమర్షియల్ రోల్స్ చేసి ఆ గౌరవాన్ని పోగొట్టుకోలేను. అందుకే కథలు వినే విషయంలో కాస్తంత కఠినంగానే ఉంటున్నా. డబ్బుకోసమో, లేక పెద్ద సంస్థ అనో కళ్లు మూసుకొని సంతకం చేయట్లేదు. కథలో లోతు, పాత్రలో బలం ఉందనిపిస్తేనే 'ఓకే' చెబుతున్నా. రీసెంట్‌గా వచ్చిన 'డెకాయిట్' సినిమాలోని పాత్రను కూడా ప్రాధాన్యతను బట్టే 'ఎస్' చెప్పాను. అనుకున్నట్టే ఆ పాత్రకు మంచి స్పందన వస్తున్నది' అంటూ ఆనందం వ్యక్తం చేసింది మృణాళ్‌ఠాకూర్.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com